ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 29 అక్టోబరు 2024



పత్తికోటలో ధరలు పడిపోవడంతో అమ్ముకోలేక ఇంటిలో నిల్వ చేసిన వేరుశనగ కాయలు

వేరుశనగ రైతులకు ఈసారి కూడా కలిసి రాలేదు. ధరలు కుప్పకూలిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రతి ఏటా ఖరీఫ్ రైతులు అతివృష్టి.. లేదా అనావృష్టితో నష్టాలు చవిచూస్తునే ఉన్నారు. ఈసారి కూడా వేరుశనగ పంటకు అవసరమైనప్పుడు వర్షాలు కురవలేదు. ఫలితంగా దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఎకరాకు కేవలం మూడు నుంచి ఐదు బస్తాల కాయలే దిగుబడి వచ్చాయి. అరకొరగా చేతికొచ్చిన వేరుశనగ కాయలను అమ్ముకుందామంటే ధరలు కూడా పతనం కావడంతో రైతులు కుమిలిపోతున్నారు. ఈసారైనా పంట రాకపోతుందా... కష్టాలు తీరకపోతాయా అన్న ఆశతో ఖరీఫ్‌లో వర్షాధారంగా పంటలు సాగు చేస్తున్న రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

మళ్లీ.. నిరాశే..!

- కుప్పకూలిన వేరుశనగ కాయల ధర
- ఖరీఫ్ రైతులకు తీవ్ర నష్టం
- 43 కేజీల బస్తా రూ.3700 నుంచి రూ.2 వేలకు పడిపోయిన వైనం
- అరకొరగా చేతికందిన పంట
- ఎకరాకు మూడు నుంచి ఐదు బస్తాలే
- పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి



చిటికివారిపల్లెలో ఆరబెట్టిన వేరుశనగ కాయలు

ములకలచెరువు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల వరకు వేరుశనగ పంట సాగు చేశారు. విత్తనాల కొనుగోలు, దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, గడ్డి తొలగించడం, కూలీల దగ్గర నూర్పిడి చేయించడం, వేరుశనగ చెట్లు ఇళ్ల వద్దకు తోలడం తదితర ఖర్చులు వస్తున్నాయి. దీంతో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు ఆశాజనకంగా పడడంతో వేరుశనగ పంటను సాగు చేశారు వేరుశనగ చెట్లు ఏపుగా పెరిగాయి. కాయలు దిగే సమయమైన సెప్టెంబరు మొదటి వారంలో వరుణుడు ముఖం చాటేయడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని వేరుశనగ చెట్లు నిలువునా ఎండిపోయాయి. తరువాత వర్షం కురిసినా ప్రయోజనం లేకుండాపోయింది. అక్టోబరులో వచ్చిన తుఫాను కారణంగా కురిసిన వర్షాల తరువాత వేరుశనగ కాయలు నూర్పిడి చేశారు. అత్యధిక రైతులకు ఎకరాకు మూడు నుంచి ఐదు మూటలు దిగుబడి వచ్చాయి. వేరుశనగ పంట నూర్పిడి చేయడం, కట్టెను ఇళ్ల వద్దకు తోలుకోవడం, కాయలు విడిపించడం, ఎండకు ఆరపెట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో కాయలను సంచులు, ఇళ్లలో వేసి అమ్మకానికి సిద్ధం చేశారు. తీరా కాయలు అమ్మే సమయంలో ధరలు క్రమంగా తగ్గిపోతున్నాయి. 15 రోజుల క్రితం వరకు 43 కిలోల బస్తా రూ.3700 వరకు పలికింది. ప్రస్తుతం రెండు రోజులుగా ధర కుప్పకూలి 43 కేజీల బస్తా రూ.2 వేలకు చేరింది. ఒక్కసారిగా బస్తా ధర రూ.1700 తగ్గిపోయింది.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిన కొనుగోలు కేంద్రాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఏర్పాటు చేస్తుందేమోనన్న ఆశతో వేరుశనగ రైతులు ఉన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం ఉన్న మద్దతు ధరైనా లభిస్తుందని ఆశతో ఉన్నారు. నష్టం తగ్గే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక దళారులు నిర్ణయించిన ధరలకే రైతులు వేరుశనగకాయలను విక్రయించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తాము నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో వేరుశనగ కాయలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పత్తికోట సమీపంలో ఎండిపోయిన వేరుశనగ పంట

సాగు ఖర్చు కూడా రాలేదు..



ములకలచెరువు మండలం పత్తికోట పంచాయతీ చిటికివారిపల్లెకు చెందిన రైతు వజ్రాల శివన్న మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాడు. దీనికి గానూ రూ.60 వేలు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ఈ రైతు వేరుశనగ కాయలను విడిపించి మిద్దెపైన ఆరబెట్టే పనిలో పడ్డాడు. మూడు ఎకరాల సాగుకు 30 కేజీల చొప్పున 15 బస్తాల కాయలు దిగుబడి వచ్చాయి. రైతు ఈ కాయలను అమ్మాలంటే మూట 43 కేజీల చొప్పున పోస్తే సుమారు 10 బస్తాల కాయలు అవుతాయి. ప్రస్తుతం ఉన్న ధరలో వీటిని అమ్మితే వచ్చేది రూ.30 వేలే. దీనిని బట్టి చూస్తే రైతుకు రూ.30 వేలు నష్టం వస్తుంది.

ఖర్చు రూ.40 వేలు.. వచ్చేది 16వేలే..



చిటికివారిపల్లెకు చెందిన రైతు పూజారి వెంకటరమణ రెండు ఎకరాల్లో పంట సాగు చేశాడు. దీనికి గానూ రూ.40 వేలు ఖర్చు వచ్చింది. ఇతనికి 10 బస్తాల కాయలు దిగుబడి వచ్చాయి. 43 కేజీల బస్తాలు చేస్తే ఏడు నుంచి ఎనిమిది మూటలు అవుతాయి. ప్రస్తుతం ఉన్న ధరలతో పోలిస్తే ఈ రైతు ప్రస్తుతం ఉన్న ధరతో పోలిస్తే రూ.14 వేల నుంచి రూ.16 వేలు రావచ్చు. దీని బట్టి చూస్తే రైతుకు రూ.24 వేల నుంచి రూ.26 వేల వరకు నష్టం వస్తుంది.



రెండు నెలల్లోనే ఐదేళ్ల అనుభవం వచ్చింది

- మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

ఇంటర్వ్యూ

మదనపల్లె టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టర్‌గా మదనపల్లెలో తొలి పోస్టింగ్.. ఇక్కడికి రాకముందే సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం సంఘటన. అనంతర పరిణామాలతో ప్రజల నుంచి వేల సంఖ్యలో వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం తదితర విషయాలతో రెండు నెలల్లోనే ఐదేళ్ల అనుభవం వచ్చిందని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వెల్లడించారు. పలు రెవిన్యూ అంశాలపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: మూడు నెలల పాలనలో ఏమి నేర్చుకున్నారు ?

జవాబు: అనంతపురం నగర కమిషనర్ పోస్టింగ్ తరువాత మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా చేరాను. ఫైళ్ల దహనం ఘటన తరువాత నిత్యం 500 నుంచి 600 పిటీషన్స్ వచ్చేవి. వీటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపి దాదాపు అన్నింటికీ పరిష్కారం చూపాము. రెండు నెలల్లో ఐదేళ్ల అనుభవం వచ్చినట్లు అయ్యింది.

ప్రశ్న: పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను ఎలా పరిష్కరిస్తున్నారు?

జవాబు: పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్‌డే)లో వచ్చే చిన్న సమస్యలను కూడా పరిష్కరిస్తున్నాము. దీనివలన ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పేదల భూముల కబ్జా విషయంలో సీరియస్ యాక్షన్ తీసుకుంటున్నాము. కాకుంటే కొన్ని సమస్యలపై అర్జీలు పదేపదే రీ ఓపెన్ అవుతున్నాయి. వీటిని లోతుగా పరిశీలించి అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇస్తున్నాం. 40 వరకు రీఓపెన్ అయిన అర్జీలన్నీ భూవివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, చెరువుల ఆక్రమణలపై వస్తున్నాయి.

ప్రశ్న: డివిజన్‌లో ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్ ఎంత వరకు వచ్చింది?

జవాబు: మదనపల్లె డివిజన్‌లో ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్ దాదాపు పూర్తి కావచ్చింది. ఇందులో 52 శాతం భూములను వివిధ కారణాలతో రిజెక్షన్ లిస్టులో పెట్టాము. పూర్తి నివేదికలను కలెక్టర్‌కు పంపాము.

ప్రశ్న: పలు సర్టిఫికెట్ల రిజెక్షన్‌పై సుమోటోగా విచారణ చేపట్టారెందుకు?

జవాబు: పలు మండలాల్లో ఇబ్బడిముబ్బడిగా సర్టిఫికెట్ల రిజెక్షన్స్ వచ్చాయి. వీటిపై సుమోటోగా తీసుకుని ఆయా మండలాలకు వెళ్లి విచారించాను. ముఖ్యంగా కుల ధృవీకరణ పత్రాలపై కేంద్ర నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి వస్తోంది. ఒకసారి కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లను ఒకసారి జారీ చేశాక, రెండో సారి మంజూరుపై ప్రభుత్వం మెటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం మంచి నిర్ణయమే. వాట్సప్‌లోనే ఈ సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన ఫైళ్ల రికవరీ ఎప్పుడు?

జవాబు: కాలిపోయన ఫైళ్ల ఒరిజినల్ కాపీలను తహసీల్దార్ కార్యాలయాల నుంచి కలెక్టరేట్‌కు పంపాము. వీటిలో వెబ్ ల్యాండ్, 22ఏ, డాటెడ్ ల్యాండ్, అసైన్‌మెంట్ ల్యాండ్ ఫైళ్లన్నీ కలెక్టర్ ఆదేశాలతో రికవరీ చేస్తాం. మిగిలిన ఇళ్ల స్థలాల ఫైళ్లపై తహసీల్దార్‌లకు సూచించి అక్కడి నుంచి ఫైళ్లను రికవరీ చేస్తాం.

ప్రశ్న: సివిల్ సప్లైస్‌లో అక్రమాలపై ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: చౌకదుకాణాలతో పాటు ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేస్తున్నాం. లీగల్ మెట్రాలజి అధికారుల సమన్వయంతో పెట్రోల్ పంపులు తనిఖీ చేస్తాం. దుకాణాల్లో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంపై కేసులు నమోదు చేస్తాం.

ప్రశ్న: డివిజన్ స్థాయి సమావేశాలు ఎప్పుడు నిర్వహిస్తారు?

జవాబు: రెండు నెలలు వివిధ కారణాలతో డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం, పీసీపీఅండ్‌టీ సమావేశాలు నిర్వహించేందుకు వీలుకాలేదు. నవంబరులో ఈ రెండు సమావేశాలు నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటి సమావేశం కూడా నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తాం.

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్



ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం

- అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి
- కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్యలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని, ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక అని తెలిపారు. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, నాణ్యతే ప్రామాణికంగా సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా రీఓపెనింగ్ లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

అటవీశాఖ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయండి

- హార్సిలీహిల్స్‌లో సిబ్బందికి డీఎఫ్‌వో ఆదేశాలు



హార్సిలీహిల్స్‌లో అటవీశాఖ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్

బి.కొత్తకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అటవీ శాఖ ప్రాంగణాన్ని పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా అభివృద్ధి చేయాలని జిల్లా అటవీ శాఖాధికారి జగన్నాథ్‌సింగ్ ఆదేశించారు. సోమవారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. అటవీ శాఖ ప్రాంగణంలోని జూపార్క్, మానససరోవరంలోని బోటింగ్, పాత వ్యూపాయింట్, మొసళ్లపార్కుతో పాటు హిల్స్‌పై చూడదగ్గ ప్రదేశాలైన గాలిబండ, న్యూ వ్యూపాయింట్ తదితర ప్రాంతాలలో తిరిగారు. ఈ సందర్భంగా ఆయన అటవీశాఖ సిబ్బందితో సమీక్షించారు. హార్సిలీహిల్స్ దేశవ్యాప్త గుర్తింపు పొందిన పర్యాటక ప్రదేశమని, అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం చేయదగిన వినోద కార్యక్రమాలు, సౌకర్యాలు చేయాలన్నారు. రూ.20 కోట్లతో రెండు కాటేజీల నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా హిల్స్‌లోని అటవీ శాఖ ప్రాంగణంలో సుందరీకరణ పనులకు అంచనాలు తయారుచేసి పంపాలని, సాధ్యమైనంత త్వరగా నిధులు విడుదల చేయిస్తామని, ఆ పనులను పూర్తి చేసే బాధ్యత తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్‌బాబు, సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

హిల్స్‌లో ఒబెరాయ్ హోటల్ స్థలానికి సర్వే

బి.కొత్తకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో రూ.200 కోట్లతో ఒబెరాయ్ సంస్థ నిర్మంచనున్న హోటల్ స్థలానికి అధికారులు సోమవారం సర్వే చేశారు. దేశంలోనే హోటల్ రంగంలో ప్రముఖ సంస్థగా పేరొందిన ఒబెరాయ్‌కు హార్సిలీహిల్స్‌లో 20.80 ఎకరాల స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడిన విషయం తెలిసిందే. దీనిపై ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ఇటీవల హిల్స్‌ను సందర్శించారు. వీరికి హిల్స్ ప్రత్యేకత గురించి, టూరిజం అభివృద్ధి గురించి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు వివరించారు. ఒబెరాయ్ సంస్థ బోర్డు మీటింగ్‌లో చర్చించిన అనంతరం హిల్స్‌లో పనులు ప్రారంభిస్తామని అప్పట్లో సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. తాజాగా రెవెన్యూ సిబ్బంది సర్వే మొదలుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

రైతు కుటుంబానికి పరిహారం పంపిణీ




రైతు చిన్నరాజారెడ్డి సతీమణికి చెక్కు అందజేస్తున్న ఫారెస్టు సిబ్బంది

వీలేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతు చిన్న రాజారెడ్డి కుటుంబానికి ఫారెస్టు అధికారులు సోమవారం పరిహారం అందజేశారు. ఏనుగుల దాడిలో మృతి చెందిన వారికి గతంలో ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం అందజేసేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఆ పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచారు. చిన్న రాజారెడ్డి మృతి చెందిన రోజునే ఈనెల 15వ తేదీ రూ.5 లక్షలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, డీఎఫ్‌వో జగన్నాథ సింగ్ అందజేశారు. మిగిలిన రూ.5 లక్షలను సోమవారం కలికిరి ఎఫ్‌బీవో గిరినాథ్, ఏబీవో జ్యోతి చిన్నరాజారెడ్డి సతీమణి సుజాతకు చెక్కు రూపంలో అందజేశారు.

ప్రాణం తీసిన చికెన్ ముక్క

- గొంతులో ఇరుక్కుని ఊపిరాడక బాలుడి మృతి

రాజంపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చికెన్ ముక్కా నోటిలో ఇరుక్కుని సుశాంక్ (2) అనే చిన్నారి ఊపిరాడక ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా సుగాలితాండకు చెందిన కృష్ణయ్య, మణి దంపతులు ఇరువురు కూలీ పనులు చేసుకుంటూ రాజంపేట పట్టణంలోని మన్నూరు సాతవీధిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం కృష్ణయ్య చికెన్ తెచ్చాడు. దానిని వండేందుకు పక్కన పెట్టగా చిన్నారి తెలియక ఒక ముక్కను మింగాడు. మధ్యాహ్నానికి ఆ బాలుడికి గొంతు దగ్గర వాపు రావడంతో పాటు శ్వాస కూడా సరిగ్గా తీసుకోలేకపోవడంతో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.





దీపావళి బొనాంజా

- ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం
- నేటి నుంచి బుకింగ్
- ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు దీపావళి బొనాంజా ఇవ్వనుంది. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం కానుంది. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈ పథకానికి సంబంధించిన బుకింగ్స్ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గత ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ కూటమి సూపర్‌సిక్స్ పేరుతో మేనిఫెస్టో ప్రకటించింది. అందులో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. గత ఎన్నికల్లో కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు మూడున్నర నెలలు కావస్తోంది. ఈ నేపథ్యంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సూపర్ సిక్స్‌లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం పట్టాలెక్కనుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి లబ్ధిదారులు గ్యాస్‌ను బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

సూపర్ సిక్స్ పథకాలలో పేర్కొన్న వాటిలో దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ముఖ్యమైనది. రాష్ట్రంలో అర్హులందరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఏడాదికి ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోబోతున్నారు. ఇందుకు దీపావళిని రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తంగా నిర్ణయించి లబ్ధిదారులకు దీపావళి కానుకగా అందించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం 34 ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలు ఉండగా మొత్తం ఎల్‌పీజీ కనెక్షన్లు 5,16,889 ఉన్నాయి. దీపం కనెక్షన్లు 2,03,085 ఉండగా, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ఎల్‌పీజీ కనెక్షన్లు 12,929 ఉన్నాయి.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

ఈ పథకానికి అర్హులు ఎవరో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రానికి చెందిన పౌరులై ఉండాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వాళ్లై ఉండాలి. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలి. దీనికి గ్యాస్ కనెక్షన్, రేషన్, ఆధార్ కార్డులు ప్రాతిపదికగా నిర్ణయించారు. ఈనెల 29 నుంచి లబ్ధిదారులు దీపం పథకానికి సంబంధించి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకోగానే రాష్ట్రప్రభుత్వం నుంచి లబ్ధిదారుల ఫోన్‌కు (మెసేజ్) ఎస్ఎంఎస్ వస్తుంది. బుకింగ్ కన్‌ఫర్మ్ అయ్యాక పట్టణాల్లో 24 గంటలు, పల్లెల్లో 48 గంటల్లో సిలిండర్ సరఫరా అవుతుంది. సిలిండర్ డెలివరీ అయ్యాక 48 గంటల్లోగా లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బు జమ అవుతుంది. ప్రస్తుతం ఇంట్లో ఉపయోగించే గ్యాస్ సిలిండర్ ధర రూ.876 కాగా అందులో రూ.25 ప్రభుత్వం రాయితీ కింద బ్యాంకు అకౌంట్లో వేస్తోంది. అయితే మిగిలిన రూ.851 లబ్ధిదారుల అకౌంటులో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ఈనెల 31వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31లోపు మొదటి సిలిండర్ ఎప్పుడైనా తీసుకోవచ్చు. ఒకవేళ లబ్ధిదారులకు ఏవైనా సమస్యలుంటే 1967 నెంబర్‌కు కాల్ చేసి చెప్పుకోవచ్చు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం గొప్ప ముందడుగుగా ప్రజలు పేర్కొంటున్నారు. ఈ పథకం అమలు వల్ల మహిళలకు ఎంతో మేలు కలగనుంది. కుటుంబానికి ఏడాదికి సుమారు రూ.2500 లబ్ధి చేకూరనుంది.



హోరాహోరీగా..

- రెండోరోజు ఉత్కంఠగా సాగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు

6





హైవే.. నో వే..!

- కడప-చెన్నై జాతీయ రహదారి అధ్వానం
- అడుగడుగునా గుంతలమయం
- ప్రయాణికులు, వాహనదారుల ఇక్కట్లు

7

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- రెండవరోజు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లు
- 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు
- దాతల సహకారంతో క్రీడాకారులకు భోజన వసతి



కబడ్డీ ఆడుతున్న చిత్తూరు- నెల్లూరు బాలికల జట్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల్లో క్రీడా పోటీలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంత్రి సొంత నియోజకవర్గమైన రాయచోటి పట్టణంలో ఉమ్మడి కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంతల పర్యవేక్షణలో, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఆర్గనైజర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వాహకులు నరసరాజు, రెడ్డయ్య, జగదీశ్వరయ్య, వేణుమాధవరాజు, మనోహర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో కబడ్డీ క్రీడా పోటీలను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 20 జట్ల మధ్య హోరాహోరీగా సాగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద ఎత్తున మైదానానికి చేరుకొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల బాలబాలికల క్రీడాకారులకు దాతల సహకారంతో భోజన వసతి సౌకర్యాలను అత్యంత పకడ్బందీగా కల్పిస్తున్నారు. క్రీడాకారులకు పట్టణంలోని పలు పాఠశాలల్లో భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రెండవ రోజు విజేతలు వీరే

రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రెండవ రోజు పలు జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచారు. క్రీడా పోటీల్లో భాగంగా బాలుర విభాగంలో మొదటగా వైజాగ్- ప్రకాశం జిల్లాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు 22 పాయింట్లతో విజేతగా నిలిచింది. అలాగే శ్రీకాకుళం- వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 పాయింట్లతో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు విజయం సాధించగా, పశ్చిమగోదావరి- అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 25 పాయింట్లు అనంతపురం జట్టు గెలుపొందగా కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5 పాయింట్లతో కర్నూలు జట్టు విజయం సాధించింది. అలాగే ఈస్ట్ గోదావరి- గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 పాయింట్ల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించగా, విశాఖపట్నం- వైఎస్‌ఆర్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 26 పాయింట్లతో కడప జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం- ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 పాయింట్లతో ప్రకాశం జట్టు విజయం సాధించగా, చిత్తూరు- అనంతపురం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 పాయింట్లతో అనంతపురం జట్టు గెలుపొందింది. అలాగే కృష్ణ- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక పాయింట్ తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించగా విజయనగరం- గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 పాయింట్ల తేడాతో గుంటూరు విజయం సాధించగా, శ్రీకాకుళం- విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 17 పాయింట్లతో శ్రీకాకుళం గెలుపొందింది. చిత్తూరు- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 18 పాయింట్లతో చిత్తూరు గెలుపొందగా, కృష్ణ- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక్క పాయింట్ తేడాతో కృష్ణ జట్టు విజయం సాధించింది. అలాగే అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల బాలికల విభాగంలో వైఎస్‌ఆర్ కడప- విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 పాయింట్ల తేడాతో విశాఖపట్నం, కర్నూలు- ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 16 పాయింట్లతో కర్నూలు విజయం సాధించగా, ప్రకాశం-గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 పాయింట్లతో గుంటూరు జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 26 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం జట్టు ఘనవిజయం సాధించింది. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి.

నాలుగేళ్లుగా పాల్గొంటున్నాను

- యమున, శ్రీకాకుళం జిల్లా



గడిచిన నాలుగేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు ఉద్దానం ఛాంపియన్స్‌తో పాటు అసోసియేషన్ మీట్స్, స్కూల్ గేమ్స్ ఆడాను. ఏడో తరగతి నుంచి గేమ్స్‌లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని 6 మెడల్స్ ప్రశంసాపత్రాలు సాధించాను. జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది

- ఇందు, వెలిగొండ మండలం, కర్నూలు



కర్నూలు జిల్లా జట్టు తరపున రాయచోటిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. నేను వెలుగొండు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. గడిచిన రెండేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటూ అండర్-19 విభాగంలో ఎంపికైన రాష్ట్ర స్థాయిలో ప్రజెంట్ చేశాను. క్రీడా పోటీల్లో పాల్గొనడం మానసిక ప్రశాంతతను ఇస్తోంది.

ఇక్కడ ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉంది

-నరసరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం చీఫ్ ప్యాట్రన్



కూటమి ప్రభుత్వం సహకారంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటి పట్టణంలో రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల క్రీడాకారులకు మంత్రి ప్రత్యేక చొరవతో అన్నిరకాల ఏర్పాట్లను కల్పించాము. జిల్లా కేంద్రమైన రాయచోటిని క్రీడా హబ్‌గా తయారు చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నిరంతరం పనిచేస్తుంది.

క్రీడాపోటీలతో మానసిక స్థైర్యం

- పూజిత, కొర్లకుంట, కృష్ణా జిల్లా



కబడ్డీ పోటీలు మానసిక స్థైర్యాన్ని నింపుతున్నాయి. నేను కృష్ణా జిల్లాలోని కొర్లకుంటలో గల ముసునూరు ఏపీఆర్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాను. గత మూడేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాను. స్టేట్ లెవెల్ మీట్‌లో ఒక సిల్వర్ మెడల్ కూడా సాధించాను.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

-పి.లోకేశ్, కాటకోటేశ్వరం, వెస్ట్ గోదావరి జిల్లా



పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి. నేను వెస్ట్ గోదావరి జిల్లా నిడదవోలులో ఏకేఆర్‌జీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాను. రెండేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించే మీట్స్‌తో పాటు ప్రైవేట్ మీట్స్‌లో కూడా పాల్గొని 3 షీల్డులు, 2 మెడల్స్‌తో పాటు ఒక కప్పు కూడా గెలుపొందాను.

రాష్ట్ర పోటీలు ఆనందాన్ని కలిగించింది

-దివ్యశ్రీ, తాడిమల్లు, వెస్ట్‌గోదావరి జిల్లా



నేను వెస్ట్ గోదావరి జిల్లా తాడిమల్లు జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్నాను. గత సంవత్సర కాలంగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటివరకు రెండు స్టేట్ మీట్స్‌తో పాటు జిల్లా స్థాయిలో కూడా ఆడి ఒక మెడల్ సాధించాను. ఆడపిల్లలకు చదువే కాకుండా క్రీడా పోటీలు మానసిక ధైర్యాన్ని నింపుతాయి. ఇక్కడ క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు.

కోచ్ శిక్షణతో క్రీడల్లో రాణిస్తున్నాను

- విస్మత్ గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల, కడప



కోచ్ శ్రీధర్ శిక్షణతో పోటీల్లో బాగా రాణిస్తున్నాను. గతంలో కంటే గత రెండు సంవత్సరాలుగా కోచ్ శ్రీధర్ వద్ద శిక్షణ పొందిన తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాను. కడప జిల్లా జట్టు తరఫున రాయచోటిలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తినిచ్చింది.

మదనపల్లె పట్టణ బ్యాంకుకు..
మోగిన ఎన్నికల నగారా..

11న ఓటర్ల తుది జాబితా ● 22న నామినేషన్ల స్వీకరణ ● 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్



వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి దుర్గమ్మ, టౌన్‌బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్

మదనపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోఆపరేటివ్ పట్టణ బ్యాంకుకు ఎన్నికల నగారా మోగింది. నాలుగేళ్లకు పైగా అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి (పీఐసీ) పాలనలో ఉన్న అర్బన్ బ్యాంకుకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. అధికారుల సూచన మేరకు ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్.. ఎన్నికల అధికారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బి.దుర్గమ్మను ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ క్రమంలో స్థానిక టౌన్‌బ్యాంకులో బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్‌తో కలసి ఎన్నికల అధికారి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా దుర్గమ్మ మాట్లాడుతూ అక్టోబరు 26, కలెక్టర్ తనను ఎన్నికల అధికారిగా నియమించినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా నవంబరు 2న ఓటర్ల జాబితా ప్రదర్శన, 3న ఓటర్ల జాబితా ప్రచురణ, వారం రోజుల లోపల అభ్యంతరాల స్వీకరణ, అనంతరం 11న ఫైనల్ జాబితా ప్రచురిస్తామన్నారు. అనంతరం 22న నామినేషన్ల స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని దుర్గమ్మ పేర్కొన్నారు. అభ్యర్థుల నుంచి ఎన్నికలకు పోటీ ఉంటే 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి వివరించారు. గతంలో ఉన్న పాలకవర్గం పదవీకాలం 2020 జూన్ 19వ తేదీతో పూర్తికాగా, అప్పటి నుంచి ప్రత్యేకాధికారి పాలనలో పట్టణ బ్యాంకు కొనసాగింది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మదనపల్లెటౌన్ ప్రధాన కార్యాలయం, ఎన్టీఆర్ సర్కిల్ బ్రాంచి, పుంగనూరు బ్రాంచి పరిధిలోని 4,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 12 మంది డైరెక్టర్లలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకో నున్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డీఆర్‌వో, ఆర్డీవో



డీఆర్‌వోగా బాధ్యతలు తీసుకుంటున్న మధుసూదన్‌రావు

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను రాయచోటి నూతన డీఆర్‌వోగా నియమితులైన కె.మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్‌ను కూడా వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నూతనంగా జిల్లాకు వచ్చిన డీఆర్‌వో, ఆర్డీవోలకు కలెక్టర్, జేసీలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీఆర్‌వో తన ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో నాగభూషణం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కార్లు, ప్రమాదంలో గాయపడిన బాధితుల్లో ఒకరు

కలకడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతువారిపల్లె క్రాస్ సమీపంలో చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పీలేరు నుంచి కలకడ వైపు వస్తున్న కారును రాయచోటి నుంచి పీలేరుకు వెళుతున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ కారులోని రాజంపేటకు చెందిన రఫు(39)కు, అలాగే మరో కారులోని కర్నూలు జిల్లాకు చెందిన మహేష్(25), శ్రీనివాసులు(40), అనిల్(37), కిశోర్(45)లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో
భవన నిర్మాణ కార్మికులకు గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దమండ్యంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం పెద్దమండ్యం పాపేపల్లె గ్రామంలోని తురకపల్లెకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు షేక్ నజీర్ (40), అదే గ్రామానికి చెందిన గుడిసోని చెరువుకు చెందిన మరో కార్మికుడు పఠాన్ ఇమ్రాన్(24) ప్రతి రోజులాగే సోమవారం భవన నిర్మాణ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో మోల్డింగ్ కమ్మి పైకెత్తుతున్న సందర్భంగా 33 కేవీ విద్యుత్ లైన్‌కు కమ్మి తగిలి విద్యుత్‌షాక్‌తో ఇద్దరు భవన కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ పీవీ రమణ తెలిపారు. గాయపడిన బాధితులను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలికి గాయం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల వివరాల మేరకు.. సోమవారం నిమ్మనపల్లె మండలం, బండ్లపైకు చెందిన అగీస్తప్ప భార్య డి.లక్ష్మమ్మ(60) చౌడేపల్లె మండలం, ఎ.కొత్తూరుకులోని తన సోదరుడు ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. చేతికి తీవ్రగాయమైంది. వెంటనే ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతి రుయాకు మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ మేరకు చౌడేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో పుంగనూరు మండలం, ఈడిగపల్లె గ్రామం, కురవూరుకు చెందిన లక్ష్మణ కుమారుడు రైతు ఎ.నవీన్(35) సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు తిరుపతి రుయాకు తరలించారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా రాజ్యలక్ష్మి

కలికిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఈడీ)గా సాంఘిక సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న జి.రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిప్యుటేషన్ ప్రాతిపదిక పైన ఏడాది గడువుతో ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వ పేర్కొంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించింది. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

రైల్వేకోడూరులో గంజాయి జోరు

- కొరవడిన నిఘా, మత్తులో యువత
- ఘర్షణలకు దారితీస్తున్న వైనం
- ఇతర ప్రాంతాల నుంచి సరఫరా
- చోద్యం చూస్తున్న అధికారులు



రైల్వేకోడూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు రైల్వేకోడూరులో జోరుగా సాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని రైల్వేకోడూరుకు సరఫరా చేస్తున్నారు. యువకులు అత్యధికంగా గంజాయికి అలవాటుపడి బానిస అవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. రైల్వేకోడూరులో గంజాయి విక్రయాల ముఠా ఉంది. గంజాయి తీసుకున్న యువకులు దాడులకు దిగుతున్నారు. దీంతో గొడవలు మరింత పెరుగుతున్నాయి. ఇటీవల జరిగిన సంఘటనలే ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.

నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేస్టేషన్ రూటు, రెడ్డివారిపల్లె రూటు, బృందావనం కాలనీ రూటు, లక్ష్మీప్యారడైజ్ రూటు, చిట్వేలి రూటు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. గంజాయికి యువకులు ఐదేళ్లుగా అలవాటు పడ్డారు. దీంతో గొడవలు చెలరేగుతున్నాయి. ఇటీవల ఇరువర్గాలు గంజాయి తాగి ఘర్షణలకు దిగారు. ఇరువురికి తీవ్రంగా గాయాలయ్యాయి. అదే విధంగా ప్రతి రోజు గంజాయి సేవించిన యువకులు బైకుల్లో స్పీడుగా వెళ్లడం, పాత కక్షలు మనసులో పెట్టుకుని ఘర్షణలకు దిగడం వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది క్రితం గంజాయి విక్రయాలు చేస్తున్న మహిళను, గంజాయి సేవించిన యువకులను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ గంజాయి విక్రయాలు ఆగడం లేదు. గంజాయి ఆకును బాగా నలిపి దాన్ని సిగరేట్‌లో సగం పొడిని పారవేసి ఖాళీ భాగంలో నింపి తాగుతున్నారు. దీంతో మత్తులోకి జారిపోయి మత్తు వదిలినంత వరకు ఏ పని చేస్తుంటారో అదే పనిలో నిమగ్నమై ఉంటారు. పాత కక్షలు కల్గిన వ్యక్తులు గొడవలు పడుతున్నారు. గంజాయి మత్తులో యువత జీవితాన్ని చిత్తు చేసుకుంటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నా పట్టించుకోకుండా గంజాయి విక్ర యాలు సాఫీగా సాగుతున్నాయి. ఇంత తంతు జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహ రిస్తున్నారు. రైల్వేకోడూరు పట్టణంలో ఎక్కువగా రెడ్డివారిపల్లె, రైల్వేస్టేషన్ రూట్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయని, ఘర్షణలు అక్కడే ఎక్కువగా జరుగుతున్నా యని, గంజాయిని తాగిన యువకులు మోటారు బైకుల్లో వెళుతూ కేకలు పెడుతూ, వేగంగా బైకులను నడుపుతూ వికృత చేష్టలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆ రూట్లో యువకులు, మహిళలు వెళ్లాలంటే భయపడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు పది కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. చాలా మంది యువకులు మత్తులో బుల్లెట్ బైకుల్లో శబ్దాలు చేస్తూ వెళుతుండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో తల్లిదండ్రుల భయం లేకుండా పెరిగిన యువకులు చదు వులు మానేసి జల్సాలకు అలవాటు పడిపోతున్నారు. రాత్రి వేళల్లోనే గంజాయి బ్యాచ్ తిరుగుతోంది. ఇటీవల రెడ్డివారిపల్లె రూటులో ఇద్దరి మధ్య గొడవలు జరిగి గంజాయి బ్యాచ్ వల్ల కుటుంబ సభ్యులు కూడా వీధినపడ్డారు. ఈ ఘర్షణలో ఒకరికి కత్తిపోట్లు పడ్డాయి. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో ఆరా తీశారు. అయినా గంజాయి తాగుతున్న యువకుల ఆగడాలు రోజు, రోజుకు పెరుగుతున్నాయి. ఇదే కాకుండా ఇటీవల రేణిగుంట-మామండూరు మధ్యలో ఒక వ్యక్తి కోతి పెట్టుకుని ఉండగా ఓబులవారిపల్లె మండలానికి చెందిన రేవూరి సునీల్‌కుమార్ అనే వ్యక్తి కోతికి అరటి పండు తినిపించిన పాపానికి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో సునీల్‌కుమార్‌పై కోతిని పట్టుకున్న వ్యక్తి కత్తితో దాడి చేసి గాయ పరిచిన సంఘటన చోటు చేసుకుంది. నిఘా లేకపోవడం వల్లే మరిన్ని సంఘటనలు జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తు న్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని గట్టి చర్యలు తీసుకుంటే గంజాయి విక్రయాలు తగ్గు ముఖం పడతాయని ప్రజలు కోరుతున్నారు.



దాడి చేయడంతో ఆస్పత్రిపాలైన సునీల్ కుమార్ (ఫైల్)

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

- హేమసుందర్‌రావు, సీఐ, రైల్వేకోడూరు

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం. వస్తున్న ఆరోపణలు సులువుగా తీసుకోకుండా గట్టి చర్యలు చేపడతాం. విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రాత్రి వేళల్లో జరుగుతున్న సంఘటనలపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాము.

హైవే.. నోవే...!

- కడప - చెన్నై జాతీయ రహదారి అధ్వానం
- అడుగడుగునా గుంతలమయం
- ప్రయాణం నరకప్రాయం.. తరచూ ప్రమాదాలు
- ప్రయాణికులు, వాహనదారుల ఇక్కట్లు


బోయనపల్లె వద్ద పాడైపోయిన కడప-చెన్నై హైవే

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. కడప నుంచి ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మీదుగా వెళ్లే ఈ రహదారి పూర్తిగా పాడైపోయింది. ఇటీవల (నాలుగు రోజుల క్రితం) కురిసిన ఒక మోస్తారు వర్షాలకు ఈ డబుల్ లైన్ రహదారిలో పెద్దఎత్తున గుంతలు పడి వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. కడప నుంచి రేణిగుంట వరకు దాదాపు 2వేలకు పైబడి గుంతలు పడినట్లు ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణం సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతు న్నారు.

జాతీయ రహదారి అంటే.. అతివేగంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు అనుకుంటారు. అయితే ఒక్కోచోట అడుగుకు పైబడి గుంతలు పడిపోవడతో వాహనాలు వెళ్లడం గగనంగా మారింది. ఇక ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో కడప, కర్నూలు, అనంతపురం జిల్లా వాసులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాదు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా చెన్నై-తిరుపతికి వెళుతుంటారు. ప్రతిరోజు వేలాది వాహనాలు ఈమార్గంలో వెళుతుంటాయి. ఇంత పెద్దఎత్తున గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ఇక వర్షం పడినప్పుడు రోడ్డుకిరు వైపులా కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్లపై నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. కడప నుంచి మొదలు పెడితే అడుగడుగునా గుంతలున్నాయి. దీంతో బస్సులు, లారీలు, ట్యాంకర్లు, ఇతర వాహనాలు అతి తక్కువ వేగంతో వెళ్లాల్సి వస్తోంది. బస్సుల్లో అయితే కొద్దిపాటి వేగం పెంచినా కుదుర్లు తప్పవు. గర్భిణీస్త్రీలు, వృద్ధులు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇక ఈ రోడ్డులో వన్‌వేలో వాహనాలు నడపకపోతే ప్రమాదాలు తప్పవు. ఇటీవల అనేకచోట్ల ఈ గుంతల్లో వాహనాలు పడి వాహనదారులు కిందపడి గాయపడ్డారు. రాజంపేట మండలం ఊటుకూరు వద్ద ఓ ద్విచక్ర వాహనం గుంతలో పడిపోగా ఎదు రుగా వస్తున్న వాహనం అతనిపై వెళ్లడంతో కాలు విరిగి పోయింది. ఈ డబల్‌లైను రోడ్డులో నాలుగులైన్ల రహదారి లాగా ఎటువైపు వెళ్లే వాహనాలు అటు వెళ్లడం కష్టం. వాహనాలు ఎదురు పడడం, వాటి ని తప్పించుకోవాలంటే గుంతల్లో వెళ్లాల్సి రావడం, గుంతలున్న చోట ఒకవైపు వెళ్లాల్సిన వాహనం మరోవైపు వెళ్లాల్సి రావడం ఇత్యాది కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో రూ.3600 కోట్లతో నాలుగు లేన్ల రహదారికి టెండర్లు పూర్తయినా ఇంతవరకు ఆ రోడ్డు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం నాలుగులైన్ల రహదారి పూర్తయ్యేవరకు ఈ డబల్‌లైను హైవేపైనే వెళ్లాల్సి ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ జాతీయ రహదారిపై పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నుంచి రక్షించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.


రాజంపేట పట్టణానికి సమీపంలో గుంతలమయమైన రోడ్డు

వెంటనే గుంతలను పూడ్చండి



రేణిగుంట - కడప జాతీయ రహదారిపై పడ్డ భారీ గుంతలను పూడ్చాలి. ఈ గుంతలను పూడ్చకపోతే చాలా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రాత్రివేళ ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు వెళితే అంతే సంగతులు. కొద్దిపాటి వర్షానికే హైవేరోడ్డు అంతా గుంతలతో పాడైపోయింది. డిసెంబరు వరకు భారీ వర్షాలు కురిసే అవకాశా లున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి కొత్తగా తారువేసి రోడ్డును పునరుద్ధరించి ప్రమాదాలు అరికట్టాలి.

-మేకా నరసింహులు, మేకావారిపల్లె, రాజంపేట మండలం.

ప్రమాదాలు జరిగితే.. అధికారులదే బాధ్యత



కడప-చెన్నై హైవే రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు వెళుతుం టాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా గుంతలమయం అయ్యింది. వెంటనే గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేప ట్టాలి. ఈ గుంతలు వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే సంబంధిత శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా 4 లైన్ల రోడ్లను వెంటనే ప్రారంభించాలి.

-బొబ్బిలి రాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట మండలం

యానిమేషన్ రంగానికి మంచి డిమాండ్

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో యానిమేషన్ రంగానికి చక్కటి ప్రాధాన్యత లభిస్తుందని.. ఈ కోర్సు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ తెలిపారు. సోమవారం యూనివర్శిటీలో యానిమేషన్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో యానిమేషన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో యానిమేషన్‌కు చక్కటి డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు యానిమేషన్ కోర్సు ఒక చక్కని వరమని అన్నారు. రిజిస్ట్రార్ ఎస్.రాజేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీడియోగేమ్‌లు, సినిమాలు అద్భుతమైన కళారూపాల్లో యానిమేషన్ వినియోగంతో కొత్త పుంతలు తొక్కిందన్నారు. కార్యక్రమంలో యానిమేషన్ కోఆర్డినేటర్ దినేశ్, అధ్యాపకులు జనార్ధన్, శాంతి, రవికుమార్, విద్యానంద్, సావిత్రి, శివ, క్రిష్టారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను ఉపయోగించుకోవాలి

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీరింగ్ ద్వారా నిర్మాణ రంగంలో నూతన సాంకేతికను ఉపయోగించుకొని నాణ్యత పెంచుకోవాలని పలువురు సివిల్ ఇంజనీరింగ్ ప్రముఖులు తెలియజేశారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల పాటు జరిగిన సివిల్ ఇంజనీరింగ్ పరిశోధనలు అనే అంశంపై సమావేశాలు సోమవారంతో ముగిశాయి. వివిధ రంగాలకు చెందిన పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈసమావేశంలో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ విధానాన్ని సివిల్ ఇంజనీరింగ్‌లో ఎలా ఉపయోగించుకోవాలి, భూమి, మౌలిక విషయాలు వంటి అంశాలపై చర్చించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త, ఇతర అధికారులు, నాలుగు క్యాంపస్‌లకు చెందినపలువురు అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి సోమవారం పెన్నానదికి 12,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలా శయం నుంచి 14వేల క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుం డటంతో పెన్నాకు 12,300 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 74 క్యూసె క్కులు, దక్షిణకాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు కడప జిల్లాలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన

పులివెందుల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 10.00 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడి రోడ్డుమార్గాన వేంపల్లెకు చేరకుని అక్కడ పార్టీ నాయకులతో సమావేశ మవుతారు. అనంతరం రోడ్డు మార్గాన పులివెందులకు చేరుకుంటారు. పులివెందులలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారు. బుధవారం లింగాల మండలంలో పర్యటిస్తారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి గురువారం తిరిగి విజయవాడకు వెళతారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో నారాయణరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి (47) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. రామిరెడ్డిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులరెడ్డికి 10 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈయనకు భార్య శశికళ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక నష్టపోయాడు. అప్పులు నెత్తికొచ్చాయి. సుమారు రూ.20 లక్షల మేర అప్పుఉండడం, అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో ఆదివారం పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న శ్రీనివాసులరెడ్డిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

అత్తను కొట్టిన కేసులో అల్లుడికి ఏడాది జైలుశిక్ష

కడప క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అత్తను రోకలి బండతో కొట్టి గాయపరిచిన కేసుకు సంబంధించి అల్లుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి భార్గవి సోమవారం తీర్పునిచ్చినట్లు చిన్నచౌకు సీఐ తేజ్‌మూర్తి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప పట్టణంలోని నెహ్రూనగర్‌లో నివాసం ఉన్న సమయంలో కుటుంబ కలహాల కారణంగా 2022 జూన్ 2న అత్తపై అల్లుడు మంజుల శ్రీనివాసులు రోకలి బండ తీసుకుని చేతిపై దాడి చేయడంతో ఆమె గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు విన్న జడ్జి నేరం రోజువు కావడంతో శ్రీనివాసులుకు ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

రంగసముద్రంలో భూవివాదం


సమస్యను అదుపు చేసిన పోలీసు అధికారులు

పోరుమామిళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నెం.227లో సుమారు 41 ఎకరాలు వంక పోరంబోకు పొలం ఉండేది. అందులో 23 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు సమాచారం. అయితే 2010లో ఆ సర్వే నెంబరులో ఆర్మీ కోటా కింద ఆర్మీ ఉద్యోగి సయ్యద్‌హుస్సేన్‌కు 4.40 ఎకరాలు నమోదు అయినట్లు తెలిసింది. అయితే సోమవారం సయ్యద్‌హుస్సేన్ తమ బంధువులతో కలిసి పొలం వద్దకు వెళ్లడంతో రంగసముద్రం గ్రామానికి చెందిన స్థానికులు అడ్డు చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. విషయం పోలీసు అధికారులకు తెలియడంతో సమస్యను సద్దుమణిగేలా చేశారు. తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి వీఆర్వో ఓబయ్యను సంఘటనా స్థలానికి పంపించి వివరాలు ఆరా తీశారు. ఇరువర్గాల వారితో ఆయన మాట్లాడి రికార్డులు పరిశీలించి ఈ విషయం జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళతామన్నారు. అంతవరకు ఏ ఒక్కరూ భూమిలో దిగరాదని ఆదేశాలు జారీ చేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లగొంది దళితవాడకు చెందిన మద్దూరు నాగస్వరూప (22) అనే విద్యార్థిని ఆదివారం సాయంత్రం అదృశ్యమైంది. డిగ్రీ చదువుతున్న తన కూతురు కనిపించడం లేదంటూ విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. మద్దూరు సుబ్బరాయుడుకు ముగ్గురు కూతుర్లు. పెద్దకూతురికి తంబళ్లగొంది దళితవాడలో ఆదివారం పెళ్లి జరుగుతుండగా సాయంత్రం రెండో కూతురు నాగస్వరూప కనిపించకుండా పోయింది. అదే దళితవాడకు చెందిన బంగారుపల్లె వెంగయ్యపై అనుమానం ఉన్నట్లు విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

స్వాహా చేసిన డబ్బులపై నేడు విచారణ

చాపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన హనీఫ్‌బాష గ్రామ పంచాయతీల నిధులు స్వాహా చేశాడు. దీనిపై జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క ఈనెల 29న మంగళవారం విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హనీఫ్‌బాష బద్రిపల్లె, వెదురూరు, పల్లవోలు గ్రామపంచాయతీలకు సంబంధించి సుమారు రూ.5.70 లక్షలు స్వాహా చేశాడు. ఈఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు విడతల వారీగా సర్పంచులకు, అధికారులకు తెలియకుండా స్వాహా చేశాడు. హనీఫ్‌బాషను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నాలో మాట్లాడుతున్నసీఐటియూ నాయకులు వెంకటసుబ్బయ్య

కడప నాగరాజుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం కడప కార్పొరేషన్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అనేకమార్లు అధికారులకు తెలిపినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. చట్టబద్దమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, అడిషనల్ వర్కర్స్‌కు పనిభద్రత కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటియు నగర అధ్యక్షుడు చంద్రరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, అదే విధంగా క్లాప్ డ్రైవర్లకు జీవో నెం.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి మాట్లాడుతూ నగరంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని.. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఇత్తడి ప్రకాశ్, ఆనంద్, నాగరాజు, నరసింహులు, సాయి, నిత్యపూజయ్య, ఆదాం, మస్తాన్, పెద్దోడు, బాలాజీ, రమాదేవి, దస్తగిరమ్మ, సుంకన్న, నాగయ్య, మరియు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ విజేతగా గురుకుల పాఠశాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అభినందించారు. అనం తరం మాట్లాడుతూ పాండిచ్చేరి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఫర్ట్‌ఫ్లోర్ కర్లింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో కమలాపురం గురుకుల పాఠశాల విద్యార్థినిలు నిలవడం అభినందనీయమన్నారు. పదో తరగతి చదువుతున్న దీక్షిత మిక్స్‌డబుల్స్‌లో కాంస్య పతకం సాధించింది. అదేవిధంగా జాతీయ స్థాయి పోటీల్లో పదోతరగతి చదివే పూజిత చందనప్రియ, 9చదువుతున్న హారిక, జెస్సికాలు గేమ్ ఆడారని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని అన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తుల సమ్మ, పీఈటి చంద్ర కళావతి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు బి.కొత్తకోట విద్యార్థి



బి.కొత్తకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న శ్రావణ్ లక్ష్మీకర్ సౌత్‌జోన్ కబడ్డీజట్టుకు ఎంపికయ్యాడు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కబడ్డీ జట్టు ఎంపికలో ప్రతిభ కనవరచిన శ్రావణ్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ ప్రాబబుల్స్‌లో 300 మంది పాల్గొన్నప్పటికీ శ్రవణ్‌కు అవకాశం దక్కింది. ఈనెల 30వ తేదీ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే ఇండియా సౌత్‌జోన్ జట్టు సభ్యుడిగా పోటీలలో పాల్గొనను న్నాడు. కబడ్డీలో ప్రతిభ చూపి సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైన శ్రావణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్, రాజేంద్రనాయక్, సోమశేఖర్‌లు అభినందించారు.

అన్నమాచార్య యూనివర్శిటీలో వ్యవసాయ కళాశాల ప్రారంభోత్సవం


వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీలో సోమవారం వ్యవశాయ కళాశాలను యూనివర్శిటీ వ్యవస్థాపకులు చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కోర్సు తొలి సంవత్సరం చేరే విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ మన స్థూల దేశీయోత్పత్తి వ్యవసాయం ప్రధాన వనరు అని, మనదేశం ఎగుమతి ఆదాయానికి 70 శాతం వ్యవసాయమే తోడ్పడుతుందన్నారు. అందువల్లే అన్నివిధాల ఆలోచించి రాజంపేట లాంటి చిన్న పట్టణంలో ఈ ప్రాంత విద్యార్థులను ఉద్దేశించి యూనివర్శిటీలో వ్యవసాయ కళాశాలను ప్రారంభించామన్నారు. ఇక్కడ వ్యవసాయంలో ఉన్నత చదువులు చదివి అనేక పరిశోధనలు చేసి మెరుగైన వ్యవసాయ దిగుబడికి తోడ్పడాలన్నారు. వ్యవసాయ కళాశాల డీన్ లోక్‌నాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి : ఎస్పీ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులు వారి కుటుంబ సభ్యులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం, ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రారంభించారు. రక్తదానం చేసిన పోలీసులకు ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సుకుమార్, ప్రభుత్వ వైద్యులు ఎన్ఆర్ భాస్కర్‌రెడ్డి, షేక్. హీనా, ఎస్. కరీముల్లాబాషా, ఎస్. కదీర్‌బాషా, ఎన్. ప్రశాంతి, ఎన్. ధరణికుమార్, సయ్యద్‌సుకుమార్, రంజిత, దేవీప్రశాంతి, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' ఫిర్యాదులకు ప్రాధాన్యం

ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్ట పరిధిలో విచారించి న్యాయం అందించడానికి అన్నమయ్య జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ విద్యా సాగర్ నాయుడు ఫిర్యాదుదారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సత్కారం



డీఆర్‌వోను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ, రెవెన్యూ సిబ్బంది

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):డీఆర్‌వో సత్యనారాయణ, రాయచోటి ఆర్డీవో రంగస్వామి సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. ఆయా అధికారుల బదిలీ సందర్భంగా సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వారిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ పాలన మొత్తం డీఆర్‌వోపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆర్డీవో రంగస్వామి కూడా ప్రజల మన్నలు పొందారని కొనియడారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బంది వారిని పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, నూతన డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'నా కూతురిపై దాడి చేసిన వారిని శిక్షించండి'

రాయచోటిటౌన్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగ్గా లేని తన కుమార్తెపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ గాలివీడు మండలం ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన దేరంగుల చిన్నప్ప సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు మొరపెట్టుకున్నారు. ఈ నెల 22న తమ ఇంటిలోకి పక్కింటి వారి కోళ్లు ఇంట్లోకి రావడంతో, తన కూతురు సుజాత వాటిని తరిమిందని దాంతో ఆగ్రహించిన ప్రమీల, ఆమె భర్త రామకృష్ణ ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేశారని ఎస్పీకి వివరించారు. ఈ విషయంపై గాలివీడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారి నుంచి స్పందన లేకపోవడంతో లక్కిరెడ్డి పల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఆయన సెలవులో ఉండడంతో వారు సోమవారం నేరుగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పోలీసు బెటాలియన్‌లో మెడికల్ క్యాంపు

సిద్దవటం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలీసు 11వ బెటాలియన్‌లో సోమవారం రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించారు. దాదాపు 189 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 29 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.థియోఫిలాస, యునైటెడ్ మెడికల్ ఆఫీసర్ దివ్య రాణి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది, యూనిట్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె అక్టోబర్(ఆంధ్రజ్యోతి) 27: ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాయచోటి మండల సభా భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రెటరీ ఎస్ఆర్ షఫీ, వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, ఫైనాన్స్ సెక్రెటరీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుబహాన్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కే శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, అబ్దుల్‌అమీద్, తదితరులు పాల్గొన్నారు.

పించ కుడికాలువలో పూడిక తొలగింపు

సుండుపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పింఛా కుడి కాలువలో సోమవారం పూడిక తొలగించినట్లు ప్రాజెక్టు ఏఈఈ నాగేంద్రనాయక్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కొంత భాగమే నీళ్లు ఉన్నాయని, ఉన్నంతవరకు రైతులందరికీ నీటిని అందించాలన్న ఉద్దేశంతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈఈ వెంకట్రామయ్య, డీఈఈ చెంగల్‌రాయుడు, పింఛా ప్రాజెక్టును, కుడికాలువను పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సాగునీటిని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

రాజంపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బ్రెస్ట్ క్యాన్సర్‌పై అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం ఎర్రబల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి కారణాలు, లక్షణాలు, నివారణోపాయాలపై అవగాహన కల్పించారు.ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి వై.ప్రదీప్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రావణికుమారి, లీలామణి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

సిద్దవటం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దారు మురాద్వావలి తెలియజేశారు. మండల పరిధిలోని ఎస్.రాజంపేట రెవెన్యూ గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ గ్రామసభలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొంతమంది రైతులు మిట్ట ప్రాంతంలో ఉన్న భూముల వద్ద రహదారులపై అర్జీలు ఇచ్చారని, ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ సర్వేయర్ ఖాజామొహిద్దీన్, పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరాయుడు, రమణ రైతులు పాల్గొన్నారు.

అర్జీలపై వెంటనే స్పందించాలి

పుల్లంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వచ్చే రెవెన్యూ సమస్యలపై వీఆర్వోలు ఎప్పటికప్పుడు వెంటనే స్పందించాలని తహసీల్దారు అరవిందకిషోర్ ఆదేశించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన వీర్వోలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో వచ్చే రెవెన్యూ సమస్యలపై బాధితులకు న్యాయం జరిగే విధంగా విచారణ చేపట్టి పరిష్కారం చూపాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వెంటనే తమ దృష్టికి తేవాలని ఆదేశించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

చిన్నమండెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం వండాడి గ్రామం కదిరివాండ్లపల్లె హరిజనవాడలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మౌర్యారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల భూమిపూజ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

చిన్నమండెం: రాష్ట్ర రవాణా,యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో అధిక సంఖ్యలో వినతిపత్రాలు అందాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గతంలో భూ దోపిడీకి పాల్పడిన వారి నుంచి భూములు స్వాధీనం చేసుకొని పేదలకు ఇస్తామన్నారు. జిల్లాలోని అధికారులందరూ బాధితుల సమస్యలను సీరియస్‌గా తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూవారి నుంచి అర్జీలు స్వీకరించారు.

సభ్యత్వ నమోదులో నంబర్‌వన్‌గా నిలుస్తాం : సుగవాసి

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదులో రాజంపేట నియోజకవర్గాన్ని రాయలసీమలో మొదటిస్థానంలో నిలుపుతామని నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల నేతలను టీడీపీలో చేర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘ నాయకులు ఆయనను సత్కరించారు.

టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి ఎస్వీ రమణ, పార్లమెంట్ కార్యదర్శి సంజీవ రావు, నాగా సుధాకర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల ప్రకాష్, నాయకులు బండారు బాలయ్య, టైల్స్ నరసింహ, చెంగల్ రాయుడు, నాగేశ్వర్‌నాయుడు, షామీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సుగవాసి

ఓబులవారిపల్లె : సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే కోడూరు నియోజకవర్గం ప్రథమ స్థాయిలో ఉండేలా కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. ఓబులవారిపల్లెలో సభ్యత్వ నమోదు సందర్భంగా ఆయన మాట్లాడారు రైల్వే కోడూరు పట్టణం, రామాపురం మండలం చిట్లూరు, లక్కిరెడ్డిపల్లెలో సభ్యత్వ నమోదు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు



శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న గుత్తి నరసింహ

గుత్తి నరసింహకు శాశ్వత సభ్యత్వం

చిట్వేలి: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు చిట్వేలి మండలానికి చెందిన రాజుగుంట సర్పంచ్ గుత్తి నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్వేలి మండలం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అందలూ సభ్యత్వం తీసుకోవాలని, పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు.

దళితుల భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి(కలెక్టరేట్),అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చిన భూములను బలవంతంగా లాక్కుంటున్న రవీంద్ర నాథ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టీఎల్ వెంకటేశ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి దళితులతో కలిసి కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. 2006లో ఎస్సీ కార్పొరేషన్ కేవీపల్లి మండలం తిమ్మాపురానికి చెందిన రవీంద్ర నాథ్‌రెడ్డి నుంచి దాదాపు 43 ఎకరాలు కొనుగోలు చేసి 52 మందికి పంపిణీ చేసింది. అయితే, భూమిని విక్రయించిన వ్యక్తి లబ్ధిదారులను మభ్యపెట్టి, భయపెట్టి, ఆ భూములను తన పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అమ్మని వారి భూములు ఆక్రమించడంతోపాటు, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేస్తున్నాడని కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయంపై పూర్తిగా విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్న, వెంకట్రమణ, యువరాజు, రామసుబ్బమ్మ, ఈశ్వరమ్మ, రెడ్డెమ్మ, వెంకట్రమణ, రెడ్డిశంకర తదతరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

తాగునీటి సమస్య పరిష్కరించాలని సుండుపల్లె మండలం బండకాడ ఈడిగపల్లె ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూరిగుడిసెల్లో నివసిస్తున్నామని కనీసం బాత్‌రూంలు కూడా లేని పరిస్థితిలో ఉన్నామని కలెక్టర్‌కు వివరించారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు నెలకు మూడు వేల రూపాయ లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

లక్కిరెడ్డిపల్లె: ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లాలో నూతన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

రాజంపేట: ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్, మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని కోరుతూ రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఎస్ఎఫ్ఐ రాజంపేట పట్టణ నాయకులు మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ నవంబరు 6న దీనిపై చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'ఇసుక రీచ్‌కు అనుమతులు ఇవ్వద్దు'

"వీరబల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ పరిధిలో ఇసుకరీచ్‌కు అనుమతులు ఇవ్వవద్దని మట్లి గ్రామ ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం మట్లి పంచాయతీలో ఆ గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఇసుక రీచ్ గురించి అధికారులు ప్రస్తావించగా ఒక్కసారిగా అక్కడి గ్రామస్తులు తమ గ్రామంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తే బోరు బావుల్లో నీటి మట్టం తగ్గి పంట పొలాలు సాగు చేసుకోవడానికి అంతరాయం ఏర్పడుతుందని తిరగబడ్డారు. తహసీల్దార్ శ్రావణి, ఎంపీడీవో నూర్జహాన్‌లు జోక్యం చేసుకొని ప్రజలకు పలురకాలుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించగా ప్రజలు ప్రతి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

రామాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని గడ్డం ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీలో ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సోమవారం గాలివీడు మండలం పూలుకుంట పంచాయతీ బోరెడ్డిగారిపల్లె చెందిన గడ్డం ప్రతాప్‌రెడ్డి ఆర్థిక సాయంతో లయన్స్‌క్లబ్ రాయచోటి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మెన్ మహబూబ్‌బాషా, రాయచోటి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, ప్రేమాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల ఆధునికీకరణకు ప్రత్యేక చర్యలు

వీరబల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆధునికీకరణ, కాలువల పటిష్ఠతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని సానిపాయి పంచాయతీ పెద్దచెరువు, బోడెమ్మ చెరువులో జలహారతి ఇచ్చి గంగమ్మకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవలి వర్షాలకు చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నామన్నారు.. ఈ కార్యక్రమాల్లో మండలశాఖ అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, మాజీ సర్పంచ్ నేతి వెంకట్రమణ, జయరాంయాదవ్, లక్ష్మణరాజు, సుబ్బరాజు, శివ, రఘునాధనాయుడు, నాగయ్య, చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మకు హారతి సమర్పిస్తున్న చమర్తి

ఘనంగా వరసిద్ధి వినాయకుడి ప్రతిష్ఠ

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మాపురం లో నిర్మించిన ఆలయంలో సోమవారం వరసిద్ధి వినాయకుడిని ప్రతిష్ఠించారు. వందలాది మంది భక్తులు పూజలు నిర్వహించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పేద దళితులకు భూములను పంచండి

ఓబులవారిపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కమ్మపల్లె దళితవాడ గ్రామ ప్రజలకు భూములు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.జయరామయ్య ఆధ్వర్యంలో రాజంపేట సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం పి.కమ్మపల్లె దళితవాడ ప్రజలకు ప్రభుత్వ బంజరు భూములను ఇచ్చినా, తగిన వనరులు లేక పలువురు సాగు చేసుకోలేకపోయారన్నారు. ఇదే అదునుగా అగ్రవర్ణాల రైతులు కొంతమంది రెవెన్యూ అధికారులకు లంచాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో తమ పేరుతో నమోదు చేయించుకున్నారని తెలిపారు. గత వారంలో ఆ భూములను సొంతం చేసుకోవడానికి దాడులు చేసినా అటు అధికారులు కానీ, ఇటు కూటమి నాయకులు కాని పరా మర్శించిన పాపాన పోలేదని తెలిపారు. న్యాయం చేయకపోతే స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నేతలకు కె.వెంకట రమణ, ఎం.రమణయ్య, గుడిసె జయరామయ్య, రేవూరి క్రిష్ణయ్య. వెంకటరమణ,పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీకేఎంయూ నాయకులు

ఆలయ అభివృద్ధికి టీడీపీ నేతల కృషి

సుండుపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):. మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కళ్యాణ వేదిక, అన్నదాన సత్రంలో సుమారు 360 బండలతో ఫ్లోరింగ్ ఏర్పాటుకు తెలుగు యువత మండల అధ్యక్షుడు మాలేపాటి సురేష్ నాయుడు, సీనియర్ నాయకులు మస్తాన్ బాబు, బలిజిపల్లె శివ ఆర్థిక సహకారం అందించారు. . అనంతరం సుమారు 500 మంది గోవింద, అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు

తాగునీటి సమస్య పరిష్కరించండి

సుండుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గొంతెండుతోంది తాగు నీరు అందించండంటూ మండలంలోని జి. రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీ రెక్కెం గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. రెండేళ్ల నుంచి ఈ సమస్యపై ఎన్ని సార్లు వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేదని గ్రామస్తులు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీరు ద్వారా సరఫరా చేస్తామని చెప్పి అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్నారు. దీంతో వ్యవసాయ బావుల నుంచి తాగు నీరు తెచ్చుకుంటునట్లు తెలియజేశారు.

29 నుంచి ఆర్ఎస్‌యూ జిల్లా మహాసభలు

రాయచోటిటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని రాజంపేట పట్టణంలో నవంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) అన్నమయ్య జిల్లా 3వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా పరిధిలోని విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఉప గవర్నర్‌గా విజయకుమార్

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి206ఏ వాసవీ క్లబ్ ఉప గవర్నర్‌గా పెండ్యాల విజయకుమార్ ఎంపిక అయ్యారు. పుట్టపర్తిలో నిర్వహించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి 206ఏ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే కోడూరు నుండి పొన్నూర్ నిరంజన్ బాబు ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా, గాధంశెట్టి సుమన్ కుమార్ రీజియన్ చైర్మన్‌గా, తిరునామల కుమార్ జోన్ చైర్మన్‌గా ఎంపిక అయ్యారు. వారితో నూతన గవర్నర్ ముచ్చర్ల రాధాకృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. రైల్వేకోడూరుకు నాలుగు పదవులు రావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

పాస్‌బుక్కులు మంజూరు చేయండి

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంట పల్లె గ్రామ పంచాయతీ సమతా నగర్‌కు చెందిన దళిత, గిరిజనలకు పాస్‌బుక్కులను వెంటనే మంజూరు చేయాలని సీపీఐ నాయకులు జ్యోతి చిన్నయ్య, దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సమతా నగర్‌లోని 30 దళిత, గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున 1992లో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. కానీ, ఇంతవరకు ఆన్‌లైన్ చేసి పాసుబుక్కులను మంజూరు చేయలేదని తెలిపారు. వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో సామూహిక నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొగలి వినయ్, శెట్టిపల్లి నరసయ్య, పాలతోటి విజయ్ కుమార్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్మికులతో కలిసి పురపాలక కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని పనిముట్లు, రక్షణ పరికరాల పంపిణీ, తుప్పుపట్టిన వాహనాలు మరమ్మతులు, కార్మికులకు చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ లోపాలను సరిదిద్దాలని, ఇంజనీరింగ్ కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు జీవో నంబరు 36 అమలు చేయాలని, మరణించిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీవీ రమణ, కార్మిక నాయకులు ఎంవీ రమణ, జి.గంగయ్య, ఎం.గంగయ్య, రత్నలు, సురేష్, ఎం.రెడ్డి, నానమ్మ, లక్ష్మీదేవి, రవి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కోతకు గురైన రోడ్డు

సుండుపల్లి, అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): పింఛ, బాహుదా నదులపై రాయవారం, రెడ్డివారిపల్లె దిగువ భాగంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు కొట్టుకు పోయింది. సుమారు 5 ప్రాంతాల్లో కోతకు గురైంది. దీంతో మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ నుంచి సుమారు 6 పల్లెల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఏర్పడుతోందని, ఈ శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆదివారం ఈ రోడ్డు కోతకు గురవడంతో సోమవారం టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు అనంద్ నాయక్ తదితరులు రోడ్డును పరిశీలించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం అన్నారు.



కోతకు గురైన రోడ్డు

మహిళపై దాడి.. కేసు నమోదు

సుండుపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జనార్దన్ రెడ్డినగర్‌కు చెందిన ఓ మహిళపై అదే ప్రాంతానికి చెందిన హరినాథ అనే యువకుడు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో అసభ్యకర పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడని సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

చెకుముకి పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

రాజంపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీసాయి విద్యాలయ విద్యార్థులు జి.మనస్విన్, కె.సాయిసంతోష్, టి.చందు రాయచోటిలోని డైట్ కళాశాలలో జనవిజ్ఞానవేదిక నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ బాలరాజు, ప్రిన్సిపల్ రేణుకాదేవి మాట్లాడుతూ త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు..

నందలూరు : జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రైవేటు స్కూల్ విభాగంలో తమ విద్యార్థులు తస్నీం పేరిందేవి, రితేష్‌కుమార్ జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచారని సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ భూమన శివశంకర్ రెడ్డి తెలిపారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు సాయి డిగ్రీ విద్యార్థులు

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు విద్యార్థులు పి.జశ్వంత్, ఎన్.కళ్యాణ్ ఎంపికైనట్లు సాయి డిగ్రీ ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈ నెల 26న యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో వారు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డి.పుల్లారావు తెలిపారు. కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పాఠశాలకు మొక్కల అందజేత

పెనగలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెట్లను నాటి వాటిని పరిరక్షిస్తే బిడ్డలు తమ తల్లిదండ్రులను బాగా చూసుకున్నంత పుణ్యం వస్తుందని చక్రంపేట ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ డి.శ్రీవాణి తెలిపారు. తమ బిడ్డల పుట్టినరోజు సందర్భంగా తాను పనిచేస్తున్న చక్రంపేట ఉన్నత పాఠశాలకు ఆమె 20 కొబ్బరి మొక్కలు, పూలమొక్కలు, వివిధ ఔషద గుణాలు కలిగిన మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- రెండవరోజు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లు
- 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు
- దాతల సహకారంతో క్రీడాకారులకు భోజన వసతి


కబడ్డీ ఆడుతున్న చిత్తూరు- నెల్లూరు బాలికల జట్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల్లో క్రీడా పోటీలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంత్రి సొంత నియోజకవర్గమైన రాయచోటి పట్టణంలో ఉమ్మడి కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంతల పర్యవేక్షణలో, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఆర్గనైజర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వాహకులు నరసరాజు, రెడ్డయ్య, జగదీశ్వరయ్య, వేణుమాధవరాజు, మనోహర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో కబడ్డీ క్రీడా పోటీలను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 20 జట్ల మధ్య హోరాహోరీగా సాగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద ఎత్తున మైదానానికి చేరుకొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల బాలబాలికల క్రీడాకారులకు దాతల సహకారంతో భోజన వసతి సౌకర్యాలను అత్యంత పకడ్బందీగా కల్పిస్తున్నారు. క్రీడాకారులకు పట్టణంలోని పలు పాఠశాలల్లో భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రెండవ రోజు విజేతలు వీరే

రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రెండవ రోజు పలు జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచారు. క్రీడా పోటీల్లో భాగంగా బాలుర విభాగంలో మొదటగా వైజాగ్- ప్రకాశం జిల్లాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు 22 పాయింట్లతో విజేతగా నిలిచింది. అలాగే శ్రీకాకుళం- వైఎస్ఆర్ కడప జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 పాయింట్లతో వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు విజయం సాధించగా, పశ్చిమగోదావరి- అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 25 పాయింట్లు అనంతపురం జట్టు గెలుపొందగా కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5 పాయింట్లతో కర్నూలు జట్టు విజయం సాధించింది. అలాగే ఈస్ట్ గోదావరి- గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 పాయింట్ల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించగా, విశాఖపట్నం- వైఎస్ఆర్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 26 పాయింట్లతో కడప జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం- ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 పాయింట్లతో ప్రకాశం జట్టు విజయం సాధించగా, చిత్తూరు- అనంతపురం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 పాయింట్లతో అనంతపురం జట్టు గెలుపొందింది. అలాగే కృష్ణ- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక పాయింట్ తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించగా విజయనగరం- గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 పాయింట్ల తేడాతో గుంటూరు విజయం సాధించగా, శ్రీకాకుళం- విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 17 పాయింట్లతో శ్రీకాకుళం గెలుపొందింది. చిత్తూరు- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 18 పాయింట్లతో చిత్తూరు గెలుపొందగా, కృష్ణ- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక్క పాయింట్ తేడాతో కృష్ణ జట్టు విజయం సాధించింది. అలాగే అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప- విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 పాయింట్ల తేడాతో విశాఖపట్నం, కర్నూలు- ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 16 పాయింట్లతో కర్నూలు విజయం సాధించగా, ప్రకాశం-గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 పాయింట్లతో గుంటూరు జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 26 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం జట్టు ఘనవిజయం సాధించింది. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి.

నాలుగేళ్లుగా పాల్గొంటున్నాను

- యమున, శ్రీకాకుళం జిల్లా



గడిచిన నాలుగేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు ఉద్దానం ఛాంపియన్స్‌తో పాటు అసోసియేషన్ మీట్స్, స్కూల్ గేమ్స్ ఆడాను. ఏడో తరగతి నుంచి గేమ్స్‌లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని 6 మెడల్స్, ప్రశంసాపత్రాలు సాధించాను. జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది

- ఇందు, వెలిగొంద మండలం, కర్నూలు



కర్నూలు జిల్లా జట్టు తరపున రాయచోటిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. నేను వెలుగొండు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. గడిచిన రెండేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటూ అండర్-19 విభాగంలో ఎంపికైన రాష్ట్ర స్థాయిలో ప్రజెంట్ చేశాను. క్రీడా పోటీల్లో పాల్గొనడం మానసిక ప్రశాంతతను ఇస్తోంది.

ఇక్కడ ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉంది

-నరసరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం చీఫ్ ప్యాట్రన్



కూటమి ప్రభుత్వం సహకారంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటి పట్టణంలో రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల క్రీడాకారులకు మంత్రి ప్రత్యేక చొరవతో అన్నిరకాల ఏర్పాట్లను కల్పించాము. జిల్లా కేంద్రమైన రాయచోటిని క్రీడా హబ్‌గా తయారు చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నిరంతరం పనిచేస్తుంది.

క్రీడాపోటీలతో మానసిక స్థైర్యం

- పూజిత, కొర్లకుంట, కృష్ణా జిల్లా



కబడ్డీ పోటీలు మానసిక స్థైర్యాన్ని నింపుతున్నాయి. నేను కృష్ణా జిల్లాలోని కొర్లకుంటలో గల ముసునూరు ఏపీఆర్ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాను. గత మూడేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాను. స్టేట్ లెవెల్ మీట్‌లో ఒక సిల్వర్ మెడల్ కూడా సాధించాను.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

-పి.లోకేశ్, కాటకోటేశ్వరం, వెస్ట్ గోదావరి జిల్లా



పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి. నేను వెస్ట్ గోదావరి జిల్లా నిడదవోలులో ఏకే ఆర్‌జీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాను. రెండేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించే మీట్స్‌తో పాటు ప్రైవేట్ మీట్స్‌లో కూడా పాల్గొని 3 షీల్డ్‌లు, 2 మెడల్స్‌తో పాటు ఒక కప్పు కూడా గెలుపొందాను.

రాష్ట్ర పోటీలు ఆనందాన్ని కలిగించింది

-దివ్యశ్రీ, తాడిమల్లు, వెస్ట్‌గోదావరి జిల్లా



నేను వెస్ట్ గోదావరి జిల్లా తాడిమల్లు జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్నాను. గత సంవత్సర కాలంగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటివరకు రెండు స్టేట్ మీట్స్‌తో పాటు జిల్లా స్థాయిలో కూడా ఆడి ఒక మెడల్ సాధించాను. ఆడపిల్లలకు చదువే కాకుండా క్రీడా పోటీలు మానసిక ధైర్యాన్ని నింపుతాయి. ఇక్కడ క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు.

కోచ్ శిక్షణతో క్రీడల్లో రాణిస్తున్నాను

- విస్మత్ గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల, కడప



కోచ్ శ్రీధర్ శిక్షణతో పోటీల్లో బాగా రాణిస్తున్నాను. గతంలో కంటే గత రెండు సంవత్సరాలుగా కోచ్ శ్రీధర్ వద్ద శిక్షణ పొందిన తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాను. కడప జిల్లా జట్టు తరపున రాయచోటిలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తినిచ్చింది.

మదనపల్లె పట్టణ బ్యాంకుకు..

మోగిన ఎన్నికల నగారా..

11న ఓటర్ల తుది జాబితా ● 22న నామినేషన్ల స్వీకరణ ● 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

మదనపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోఆపరేటివ్ పట్టణ బ్యాంకుకు ఎన్నికల నగారా మోగింది. నాలుగేళ్లకు పైగా అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి (పీఏఐసీ) పాలనలో ఉన్న అర్బన్ బ్యాంకుకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. అధికారుల సూచన మేరకు ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్.. ఎన్నికల అధికారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బి.దుర్గమ్మను ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ క్రమంలో స్థానిక టౌన్‌బ్యాంకులో బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్‌తో కలసి ఎన్నికల అధికారి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా దుర్గమ్మ మాట్లాడుతూ అక్టోబరు 26, కలెక్టర్ తనను ఎన్నికల అధికారిగా నియమించినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా నవంబరు 2న ఓటర్ల జాబితా ప్రదర్శన, 3న ఓటర్ల జాబితా ప్రచురణ, వారం రోజుల లోపల అభ్యంతరాల స్వీకరణ, అనంతరం 11న ఫైనల్ జాబితా ప్రచురిస్తామన్నారు. అనంతరం 22న నామినేషన్ల స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని దుర్గమ్మ పేర్కొన్నారు. అభ్యర్థుల నుంచి ఎన్నికలకు పోటీ ఉంటే 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి వివరించారు. గతంలో ఉన్న పాలకవర్గం పదవీకాలం 2020 జూన్ 19వ తేదీతో పూర్తికాగా, అప్పటి నుంచి ప్రత్యేకాధికారి పాలనలో పట్టణ బ్యాంకు కొనసాగింది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మదనపల్లెటౌన్ ప్రధాన కార్యాలయం, ఎన్‌టీఆర్ సర్కిల్ బ్రాంచి, పుంగనూరు బ్రాంచి పరిధిలోని 4,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 12 మంది డైరెక్టర్లలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకో నున్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాశ్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి దుర్గమ్మ, టౌన్‌బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డీఆర్‌వో, ఆర్డీవో

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను రాయచోటి నూతన డీఆర్‌వోగా నియమితులైన కె.మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్‌ను కూడా వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నూతనంగా జిల్లాకు వచ్చిన డీఆర్‌వో, ఆర్డీవోలకు కలెక్టర్, జేసీలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీఆర్‌వో తన ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో నాగభూషణం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.


డీఆర్‌వోగా బాధ్యతలు తీసుకుంటున్న మధుసూదన్‌రావు

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కార్లు, ప్రమాదంలో గాయపడిన బాధితుల్లో ఒకరు

కలకడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతువారిపల్లె క్రాస్ సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పీలేరు నుంచి కలకడ వైపు వస్తున్న కారును రాయచోటి నుంచి పీలేరుకు వెళుతున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ కారులోని రాజంపేటకు చెందిన రఘు(39)కు, అలాగే మరో కారులోని కర్నూలు జిల్లాకు చెందిన మహేష్(25), శ్రీనివాసులు(40), అనిల్(37), కిశోర్(45)లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమితం 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికులకు గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దమండ్యంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం పెద్దమండ్యం పాపేపల్లె గ్రామంలోని తురకపల్లెకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు షేక్ నజీర్ (40), అదే గ్రామానికి చెందిన గుడిసోని చెరువుకు చెందిన మరో కార్మికుడు పఠాన్ ఇమ్రాన్(24) ప్రతి రోజులాగే సోమవారం భవన నిర్మాణ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో మోల్డింగ్ కమ్మి పైకెత్తుతున్న సందర్భంగా 33 కేవీ విద్యుత్ లైన్‌కు కమ్మి తగిలి విద్యుత్‌షాక్‌తో ఇద్దరు భవన కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. గాయపడిన బాధితులను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలికి గాయం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల వివరాల మేరకు.. సోమవారం నిమ్మనపల్లె మండలం, బండ్లపైకు చెందిన అగీస్తప్ప భార్య డి.లక్ష్మమ్మ(60) చౌడేపల్లె మండలం, ఎ.కొత్తూరుకులోని తన సోదరుడు ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. చేతికి తీవ్రగాయమైంది. వెంటనే ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతి రుయాకు మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ మేరకు చౌడేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో పుంగనూరు మండలం, ఈడిగపల్లె గ్రామం, కురవూరుకు చెందిన లక్ష్మణ కుమారుడు రైతు ఎ.నవీన్(35) సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు తిరుపతి రుయాకు తరలించారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా రాజ్యలక్ష్మి

కలికిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఈడీ)గా సాంఘిక సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న జి.రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిప్యుటేషన్ ప్రాతిపదిక పైన ఏడాది గడువుతో ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వ పేర్కొంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించింది. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

రైల్వేకోడూరులో గంజాయి జోరు



- కొరవడిన నిఘా, మత్తులో యువత
- ఘర్షణలకు దారితీస్తున్న వైనం
- ఇతర ప్రాంతాల నుంచి సరఫరా
- చోద్యం చూస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు రైల్వేకోడూరులో జోరుగా సాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని రైల్వేకోడూరుకు సరఫరా చేస్తున్నారు. యువకులు అత్యధికంగా గంజాయికి అలవాటుపడి బానిస అవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. రైల్వేకోడూరులో గంజాయి విక్రయాల ముఠా ఉంది. గంజాయి తీసుకున్న యువకులు దాడులకు దిగుతున్నారు. దీంతో గొడవలు మరింత పెరుగుతున్నాయి. ఇటీవల జరిగిన సంఘటనలే ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.

నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేస్టేషన్ రూటు, రెడ్డివారిపల్లె రూటు, బృందావనం కాలనీ రూటు, లక్ష్మీప్యారడైజ్ రూటు, చిట్వేలి రూటు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. గంజాయికి యువకులు ఐదేళ్లుగా అలవాటు పడ్డారు. దీంతో గొడవలు చెలరేగుతున్నాయి. ఇటీవల ఇరువర్గాలు గంజాయి తాగి ఘర్షణలకు దిగారు. ఇరువురికి తీవ్రంగా గాయాల య్యాయి. అదే విధంగా ప్రతి రోజు గంజాయి సేవించిన యువకులు బైకుల్లో స్పీడుగా వెళ్లడం, పాత కక్షలు మనసులో పెట్టుకుని ఘర్షణలకు దిగడం వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది క్రితం గంజాయి విక్రయాలు చేస్తున్న మహిళను, గంజాయి సేవించిన యువకులను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ గంజాయి విక్రయాలు ఆగడం లేదు. గంజాయి ఆకును బాగా నలిపి దాన్ని సిగరేట్‌లో సగం పొడిని పారవేసి ఖాళీ భాగంలో నింపి తాగుతున్నారు. దీంతో మత్తులోకి జారిపోయి మత్తు వదిలినంత వరకు ఏ పని చేస్తుంటారో అదే పనిలో నిమగ్నమై ఉంటారు. పాత కక్షలు కల్గిన వ్యక్తులు గొడవలు పడుతున్నారు. గంజాయి మత్తులో యువత జీవితాన్ని చిత్తు చేసుకుంటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నా పట్టించుకోకుండా గంజాయి విక్ర యాలు సాఫీగా సాగుతున్నాయి. ఇంత తంతు జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహ రిస్తున్నారు. రైల్వేకోడూరు పట్టణంలో ఎక్కువగా రెడ్డివారిపల్లె, రైల్వేస్టేషన్ రూట్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయని, ఘర్షణలు అక్కడే ఎక్కువగా జరుగుతున్నా యని, గంజాయిని తాగిన యువకులు మోటారు బైకుల్లో వెళుతూ కేకలు పెడుతూ, వేగంగా బైకులను నడుపుతూ వికృత చేష్టలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆ రూట్లో యువకులు, మహిళలు వెళ్లాలంటే భయపడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు పది కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. చాలా మంది యువకులు మత్తులో బుల్లెట్ బైకుల్లో శబ్దాలు చేస్తూ వెళుతుండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో తల్లిదండ్రుల భయం లేకుండా పెరిగిన యువకులు చదు వులు మానేసి జల్సాలకు అలవాటు పడిపోతున్నారు. రాత్రి వేళల్లోనే గంజాయి బ్యాచ్ తిరుగుతోంది. ఇటీవల రెడ్డివారిపల్లె రూటులో ఇద్దరి మధ్య గొడవలు జరిగి గంజాయి బ్యాచ్ వల్ల కుటుంబ సభ్యులు కూడా వీధినపడ్డారు. ఈ ఘర్షణలో ఒకరికి కత్తిపోట్లు పడ్డాయి. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో ఆరా తీశారు. అయినా గంజాయి తాగుతున్న యువకుల ఆగడాలు రోజు, రోజుకు పెరుగుతున్నాయి. ఇదే కాకుండా ఇటీవల రేణిగుంట-మామండూరు మధ్యలో ఒక వ్యక్తి కోతి పెట్టుకుని ఉండగా ఓబులవారిపల్లె మండలానికి చెందిన రేవూరి సునీల్‌కుమార్ అనే వ్యక్తి కోతికి అరటి పండు తినిపించిన పాపానికి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో సునీల్‌కుమార్‌పై కోతిని పట్టుకున్న వ్యక్తి కత్తితో దాడి చేసి గాయ పరిచిన సంఘటన చోటు చేసుకుంది. నిఘా లేకపోవడం వల్లే మరిన్ని సంఘటనలు జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తు న్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని గట్టి చర్యలు తీసుకుంటే గంజాయి విక్రయాలు తగ్గు ముఖం పడతాయని ప్రజలు కోరుతున్నారు.


దాడి చేయడంతో ఆస్పత్రిపాలైన సునీల్ కుమార్ (ఫైల్)

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

- హేమసుందర్‌రావు, సీఐ, రైల్వేకోడూరు

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం. వస్తున్న ఆరోపణలు సులువుగా తీసుకోకుండా గట్టి చర్యలు చేపడతాం. విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రాత్రి వేళల్లో జరుగుతున్న సంఘటనలపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాము.

హైవే.. నోవే...!

- కడప - చెన్నై జాతీయ రహదారి అధ్వానం
- అడుగడుగునా గుంతలమయం
- ప్రయాణం నరకప్రాయం.. తరచూ ప్రమాదాలు
- ప్రయాణికులు, వాహనదారుల ఇక్కట్లు



బోయనపల్లె వద్ద పాడైపోయిన కడప-చెన్నై హైవే

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. కడప నుంచి ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మీదుగా వెళ్లే ఈ రహదారి పూర్తిగా పాడైపోయింది. ఇటీవల (నాలుగు రోజుల క్రితం) కురిసిన ఒక మోస్తారు వర్షాలకు ఈ డబుల్ లైన్ రహదారిలో పెద్దఎత్తున గుంతలు పడి వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. కడప నుంచి రేణిగుంట వరకు దాదాపు 2వేలకు పైబడి గుంతలు పడినట్లు ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణం సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతు న్నారు.

జాతీయ రహదారి అంటే.. అతివేగంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు అనుకుంటారు. అయితే ఒక్కోచోట అడుగుకు పైబడి గుంతలు పడిపోవడతో వాహనాలు వెళ్లడం గగనంగా మారింది. ఇక ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో కడప, కర్నూలు, అనంతపురం జిల్లా వాసులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాదు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా చెన్నై-తిరుపతికి వెళుతుంటారు. ప్రతిరోజు వేలాది వాహనాలు ఈమార్గంలో వెళుతుంటాయి. ఇంత పెద్దఎత్తున గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ఇక వర్షం పడినప్పుడు రోడ్డుకిరు వైపులా కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్లపై నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. కడప నుంచి మొదలు పెడితే అడుగడుగునా గుంతలున్నాయి. దీంతో బస్సులు, లారీలు, ట్యాంకర్లు, ఇతర వాహనాలు అతి తక్కువ వేగంతో వెళ్లాల్సి వస్తోంది. బస్సుల్లో అయితే కొద్దిపాటి వేగం పెంచినా కుదుర్లు తప్పవు. గర్భిణీస్ర్తీలు, వృద్ధులు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇక



రాజంపేట పట్టణానికి సమీపంలో గుంతలమయమైన రోడ్డు

ఈ రోడ్డులో వన్‌వేలో వాహనాలు నడపకపోతే ప్రమాదాలు తప్పవు. ఇటీవల అనేకచోట్ల ఈ గుంతల్లో వాహనాలు పడి వాహనదారులు కిందపడి గాయపడ్డారు. రాజంపేట మండలం ఊటుకూరు వద్ద ఓ ద్విచక్ర వాహనం గుంతలో పడిపోగా ఎదు రుగా వస్తున్న వాహనం అతనిపై వెళ్లడంతో కాలు విరిగి పోయింది. ఈ డబల్‌లైను రోడ్డులో నాలుగులైన్ల రహదారి లాగా ఎటువైపు వెళ్లే వాహనాలు అటు వెళ్లడం కష్టం. వాహనాలు ఎదురు పడడం, వాటి ని తప్పించుకోవాలంటే గుంతల్లో వెళ్లాల్సి రావడం, గుంతలున్న చోట ఒకవైపు వెళ్లాల్సిన వాహనం మరోవైపు వెళ్లాల్సి రావడం ఇత్యాది కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో రూ.3600 కోట్లతో నాలుగు లేన్ల రహదారికి టెండర్లు పూర్తయినా ఇంతవరకు ఆ రోడ్డు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం నాలుగులైన్ల రహదారి పూర్తయ్యేవరకు ఈ డబల్‌లైను హైవేపైనే వెళ్లాల్సి ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ జాతీయ రహదారిపై పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నుంచి రక్షించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వెంటనే గుంతలను పూడ్చండి



రేణిగుంట - కడప జాతీయ రహదారిపై పడ్డ భారీ గుంతలను పూడ్చాలి. ఈ గుంతలను పూడ్చకపోతే చాలా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రాత్రివేళ ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు వెళితే అంతే సంగతులు. కొద్దిపాటి వర్షానికే హైవేరోడ్డు అంతా గుంతలతో పాడైపోయింది. డిసెంబరు వరకు భారీ వర్షాలు కురిసే అవకాశా లున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి కొత్తగా తారువేసి రోడ్డును పునరుద్ధరించి ప్రమాదాలు అరికట్టాలి.

-మేకా నరసింహులు, మేకావారిపల్లె, రాజంపేట మండలం.

ప్రమాదాలు జరిగితే.. అధికారులదే బాధ్యత



కడప-చెన్నై హైవే రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు వెళుతుం టాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా గుంతలమయం అయ్యింది. వెంటనే గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేప ట్టాలి. ఈ గుంతలు వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే సంబంధిత శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా 4 లైన్ల రోడ్లను వెంటనే ప్రారంభించాలి.

-బొబ్బిలి రాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట మండలం

యానిమేషన్ రంగానికి మంచి డిమాండ్

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో యానిమేషన్ రంగానికి చక్కటి ప్రాధాన్యత లభిస్తుందని.. ఈ కోర్సు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌ఏయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ తెలిపారు. సోమవారం యూనివర్శిటీలో యానిమేషన్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో యానిమేషన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో యానిమేషన్‌కు చక్కటి డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు యానిమేషన్ కోర్సు ఒక చక్కని వరమని అన్నారు. రిజిస్ట్రార్ ఎన్.రాజేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీడియోగేమ్‌లు, సినిమాలు అద్భుతమైన కళారూపాల్లో యానిమేషన్ వినియోగంతో కొత్త పుంతలు తొక్కిందన్నారు. కార్యక్రమంలో యానిమేషన్ కోఆర్డినేటర్ దినేశ్, అధ్యాపకులు జనార్ధన్, శాంతి, రవికుమార్, విద్యానంద్, సావిత్రి, శివ, క్రిష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను ఉపయోగించుకోవాలి

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీరింగ్ ద్వారా నిర్మాణ రంగంలో నూతన సాంకేతికను ఉపయోగించుకొని నాణ్యత పెంచుకోవాలని పలువురు సివిల్ ఇంజనీరింగ్ ప్రముఖులు తెలియజేశారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల పాటు జరిగిన సివిల్ ఇంజనీరింగ్ పరిశోధనలు అనే అంశంపై సమావేశాలు సోమవారంతో ముగిశాయి. వివిధ రంగాలకు చెందిన పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈసమావేశంలో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ విధానాన్ని సివిల్ ఇంజనీరింగ్‌లో ఎలా ఉపయోగించుకోవాలి, భూమి, మౌలిక విషయాలు వంటి అంశాలపై చర్చించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త, ఇతర అధికారులు, నాలుగు క్యాంపస్‌లకు చెందినపలువురు అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు కడప జిల్లాలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన

పులివెందుల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 10.00 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడి రోడ్డుమార్గాన వేంపల్లెకు చేరకుని అక్కడ పార్టీ నాయకులతో సమావేశ మవుతారు. అనంతరం రోడ్డు మార్గాన పులివెందులకు చేరుకుంటారు. పులివెందులలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారు. బుధవారం లింగాల మండలంలో పర్యటిస్తారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి గురువారం తిరిగి విజయవాడకు వెళతారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో నారాయణరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి (47) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... రామిరెడ్డిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులరెడ్డికి 10 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈయనకు భార్య శశికళ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక నష్టపోయాడు. అప్పులు నెత్తికొచ్చాయి. సుమారు రూ.20 లక్షల మేర అప్పుఉండడం, అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో ఆదివారం పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న శ్రీనివాసులరెడ్డిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారావు తెలిపారు.

అత్తను కొట్టిన కేసులో అల్లుడికి ఏడాది జైలుశిక్ష

కడప క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అత్తను రోకలి బండతో కొట్టి గాయపరిచిన కేసుకు సంబంధించి అల్లుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి భార్గవి సోమవారం తీర్పునిచ్చినట్లు చిన్నచౌకు సీఐ తేజ్ మూర్తి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప పట్టణంలోని నెహ్రూనగర్‌లో నివాసం ఉన్న సమయంలో కుటుంబ కలహాల కారణంగా 2022 జూన్ 2న అత్తపై అల్లుడు మంజుల శ్రీనివాసులు రోకలి బండ తీసుకుని చేతిపై దాడి చేయడంతో ఆమె గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు విన్న జడ్జి నేరం రోజువు కావడంతో శ్రీనివాసులుకు ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

రంగసముద్రంలో భూవివాదం



సమస్యను అదుపు చేసిన పోలీసు అధికారులు

పోరుమామిళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నెం.227లో సుమారు 41 ఎకరాలు వంక పోరంబోకు పొలం ఉండేది. అందులో 23 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు సమాచారం. అయితే 2010లో ఆ సర్వే నెంబరులో ఆర్మీ కోటా కింద ఆర్మీ ఉద్యోగి సయ్యద్‌హుస్సేన్‌కు 4.40 ఎకరాలు నమోదు అయినట్లు తెలిసింది. అయితే సోమవారం సయ్యద్‌హుస్సేన్ తమ బంధువులతో కలిసి పొలం వద్దకు వెళ్లడంతో రంగసముద్రం గ్రామానికి చెందిన స్థానికులు అడ్డు చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. విషయం పోలీసు అధికారులకు తెలియడంతో సమస్యను సద్దుమణిగేలా చేశారు. తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి వీఆర్వో ఓబయ్యను సంఘటనా స్థలానికి పంపించి వివరాలు ఆరా తీశారు. ఇరువర్గాల వారితో ఆయన మాట్లాడి రికార్డులు పరిశీలించి ఈ విషయం జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళతామన్నారు. అంతవరకు ఏ ఒక్కరూ భూమిలో దిగరాదని ఆదేశాలు జారీ చేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లగొంది దళితవాడకు చెందిన మద్దూరు నాగస్వరూప (22) అనే విద్యార్థిని ఆదివారం సాయంత్రం అదృశ్యమైంది. డిగ్రీ చదువుతున్న తన కూతురు కనిపించడం లేదంటూ విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. మద్దూరు సుబ్బరాయుడుకు ముగ్గురు కూతుర్లు. పెద్దకూతురికి తంబళ్లగొంది దళితవాడలో ఆదివారం పెళ్లి జరుగుతుండగా సాయంత్రం రెండో కూతురు నాగస్వరూప కనిపించకుండా పోయింది. అదే దళితవాడకు చెందిన బంగారుపల్లె వెంగయ్యపై అనుమానం ఉన్నట్లు విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు.

స్వాహా చేసిన డబ్బులపై నేడు విచారణ

చాపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన హనీఫ్‌బాష గ్రామ పంచాయతీల నిధులు స్వాహా చేశాడు. దీనిపై జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క ఈనెల 29న మంగళవారం విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హనీఫ్‌బాష బద్రిపల్లె, వెదురూరు, పల్లవోలు గ్రామపంచాయతీలకు సంబంధించి సుమారు రూ.5.70 లక్షలు స్వాహా చేశాడు. ఈఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు విడతల వారీగా సర్పంచులకు, అధికారులకు తెలియకుండా స్వాహా చేశాడు. హనీఫ్‌బాషను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్నసీఐటీయూ నాయకులు వెంకటసుబ్బయ్య

కడప నాగరాజుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం కడప కార్పొరేషన్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అనేకమార్లు అధికారులకు తెలిపినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, అడిషనల్ వర్కర్స్‌కు పనిభద్రత కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటియు నగర అధ్యక్షుడు చంద్రరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, అదే విధంగా క్లాప్ డ్రైవర్లకు జీవో నెం.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి మాట్లాడుతూ నగరంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని.. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఇత్తడి ప్రకాశ్, ఆనంద్, నాగరాజు, నరసింహులు, సాయి, నిత్యపూజయ్య, ఆదాం, మస్తాన్, పెద్దోడు, బాలాజీ, రమాదేవి, దస్తగిరమ్మ, సుంకన్న, నాగయ్య, మరియు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ విజేతగా గురుకుల పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పాండిచ్చేరి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన థర్డ్‌ఫ్లోర్ కర్లింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో కమలాపురం గురుకుల పాఠశాల విద్యార్థినిలు నిలవడం అభినందనీయమన్నారు. పదో తరగతి చదువుతున్న దీక్షిత మిక్స్‌డబుల్స్‌లో కాంస్య పతకం సాధించింది. అదేవిధంగా జాతీయ స్థాయి పోటీల్లో పదోతరగతి చదివే పూజిత చందనప్రియ, 9చదువుతున్న హారిక, జెస్సికాలు గేమ్ ఆడారని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని అన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తుల సమ్మ, పీఈటీ చంద్ర కళావతి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు బి.కొత్తకోట విద్యార్థి



బి.కొత్తకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న శ్రావణ్ లక్ష్మీకర్ సౌత్‌జోన్ కబడ్డీజట్టుకు ఎంపికయ్యాడు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కబడ్డీ జట్టు ఎంపికలో ప్రతిభ కనపరచిన శ్రావణ్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ ప్రాబబుల్స్‌లో 300 మంది పాల్గొన్నప్పటికీ శ్రవణ్‌కు అవకాశం దక్కింది. ఈనెల 30వ తేదీ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే ఇండియా సౌత్‌జోన్ జట్టు సభ్యుడిగా పోటీలలో పాల్గొననున్నాడు. కబడ్డీలో ప్రతిభ చూపి సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైన శ్రావణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్, రాజేంద్రనాయక్, సోమశేఖర్‌లు అభినందించారు.

అన్నమాచార్య యూనివర్శిటీలో వ్యవసాయ కళాశాల ప్రారంభోత్సవం



వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీలో సోమవారం వ్యవసాయ కళాశాలను యూనివర్శిటీ వ్యవస్థాపకులు చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కోర్సు తొలి సంవత్సరం చేరే విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ మన స్థూల దేశీయోత్పత్తి వ్యవసాయం ప్రధాన వనరు అని, మనదేశం ఎగుమతి ఆదాయానికి 70 శాతం వ్యవసాయమే తోడ్పడుతుందన్నారు. అందువల్లే అన్నివిధాల ఆలోచించి రాజంపేట లాంటి చిన్న పట్టణంలో ఈ ప్రాంత విద్యార్థులను ఉద్దేశించి యూనివర్శిటీలో వ్యవసాయ కళాశాలను ప్రారంభించామన్నారు. ఇక్కడ వ్యవసాయంలో ఉన్నత చదువులు చదివి అనేక పరిశోధనలు చేసి మెరుగైన వ్యవసాయ దిగుబడికి తోడ్పడాలన్నారు. వ్యవసాయ కళాశాల డీన్ లోకనాథ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి : ఎస్పీ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులు వారి కుటుంబ సభ్యులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం, ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రారంభించారు. రక్తదానం చేసిన పోలీసులకు ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సుకుమార్, ప్రభుత్వ వైద్యులు ఎన్ఆర్ భాస్కర్‌రెడ్డి, షేక్. హీనా, ఎస్. కరీముల్లాబాషా, ఎస్. కదీర్‌బాషా, ఎన్. ప్రశాంతి, ఎన్. ధరణికుమార్, సయ్యద్‌సుకుమార్, రంజిత, దేవీప్రశాంతి, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' ఫిర్యాదులకు ప్రాధాన్యం

ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్ట పరిధిలో విచారించి న్యాయం అందించడానికి అన్నమయ్య జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ విద్యా సాగర్ నాయుడు ఫిర్యాదుదారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

నరకానికి రా'దారులు'

● గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్లు ● ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు ● పట్టించుకోని అధికారులు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) :గ్రామీణ ప్రాంత రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. దీంతో పల్లెవాసులు రోడ్లపై వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఇక వర్షాలు పడితే రోడ్లపై దిచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీలులేకుండా ఉంటోందని వాహనదారులు వాపోతున్నారు. మండల కేంద్రమైన పెద్దతిప్ప సముద్రం నుంచి వివిధగ్రామాలకు వెళ్లే ప్రదాన రహదారులు అధ్వాన్నంగా తయార య్యాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ రోడ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లకు కనీసం మరమ్మతులు సైతం చేపట్టక పోవడంతో అవి మరింతగా గోతులు ఏర్పడి వాహనచోదకులు ఈ రోడ్లలో ప్రయాణించాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసిందంటే ద్విచక్రవాహన దారులు రోడ్లలో కిందపడి గా యాల పాలవుతున్నారు. ముఖ్యంగా మద్దయ్య గారిపల్లె నుంచి కర్ణాటక రాష్ట్రం చేలూరు వరకు వయా కందుకూరు మీదుగా వెళ్లే ప్రదాన రహదారి కందుకూరు నుంచి మన రాష్ట్ర సరిహద్దు మారుగానిపల్లె వరకు ఉన్న రహదా రి పూర్తిగా గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షం వచ్చిందంటే నానా తంటాలు పడాల్సి వస్తోందని వాహన చోదకులు వాపోతున్నారు.

అధ్వాన్నంగా అంకిరెడ్డిపల్లె రోడ్డు

మండల కేంద్రమైన పీటీఎం నుంచి అంకిరెడ్డిపల్లెకు వెళ్లే గ్రామీణ రోడ్డు పలు చోట్ల గుంతలు ఏర్పడి అద్వాన్నంగా తయారైంది. ఈ అంకిరెడ్డిపల్లె రోడ్డు నుంచి మండల కేంద్రమైన పీటీఎంకు రావాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఈ రోడ్డులో నిత్యం పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చిపోతుంటారు. గత వైసీపీ పాలనలో ఈ రోడ్డు గుండా అనేక టిప్పర్లు పయణించి రోడ్డు పూర్తిగా గుంతలమయమై ఎంతోమంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారని పలువురు వాపోతున్నారు. మండలంలో ఇవే కాకుండా ప్రతి గ్రామానికి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వాన్నంగా తయారయ్యాయని కనీసం ఇప్పటికైనా ఈ గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం

దెబ్బతిన్న గ్రామీణ రోడ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పీటీఎం రోడ్లు, భవనాల శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం చేలూరు వయా కందుకూరు మీదుగా వెళ్లే ప్రదాన రహదారి కోసం రూ.17కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు రాగానే పనులు చేపడతామన్నారు. అలాగే టి.సదుం వరికసువారిపలె చెన్నరాయునిపల్లె సరిహద్దు రోడ్డు వరకు, బి.కొత్తకోట-ములకల చెరువు రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించామని ఆయన తెలిపారు.


గుంతలమయంగా మారిన కందుకూరు - చేలూరు ప్రధాన రహదారి

ఘనంగా మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి జన్మదిన వేడుకలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ జన్మదిన వేడుకలను సోమవారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, టీడీపీ నాయకులు స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద దొమ్మలపాటి కార్యాలయంలో ఆయనను కలిసి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రమేశ్ కేక్ కట్‌చేసి ఆత్మీయులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీకే నాయుడు, ఎస్‌ఎల్‌వీ రఘు, సాయిచిత్ర భాస్కర్,నక్కలదిన్నె రవి, సాకే కృష్ణమూర్తి, రామాంజనేయులు మండల పార్టీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, మేకలరెడ్డి శేఖర్ పాల్గొన్నారు.


దొమ్మలపాటికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న టీడీపీ నాయకులు, పుర ప్రముఖులు

నిమ్మనపల్లిలో: మండలంలోని టీడీపీ నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే దొమ్మల పాటి రమేశ్ జన్మదిన వేడుకలను పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మునిరత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా స్థానిక అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి తమ అభి మానాన్ని చాటుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో లేనప్పటికీ కార్యకర్తలకు అండగా వుండి వారిని ఆదుకొన్నారని తెలిపారు. అనంతరం బాణసంచా పేల్చి కేకు కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో విజయ్, జగన్ మోహన్‌రెడ్డి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న టీడీపీ నాయకులు

క్రైస్తవులను అన్ని విధాల ఆదుకుంటా : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్ అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి):క్రైస్తవులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొ న్నారు. సోమవారం స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన క్రైస్తవ పాస్టర్ల సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవ పాస్టర్ల అసోసియేషన్ సభ్యులకు ప్రభుత్వం తరపున అందించే పథకాలను అర్హులకు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో క్రిస్టియన్ భవన్‌ను గుంటూరు పట్టణంలో పది కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. క్రిస్టియన్ పాస్టర్లకు సూపర్ సిక్స్ పథకాల్లో వేతన అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామస ముద్రం మండలాల నుంచి క్రైస్తవ ప్రతినిధులు, పాస్టర్లు పాల్గొన్నారు. ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ తరుపున మాస్టర్ జాన్‌బాబు, పాస్టర్ డేవిడ్, సీఎస్ఐ చర్చి సెక్రటరీ భక్తవత్సలం, జలజప్రసాదరావు, పాస్టర్ సుధాకర్, పాస్టర్ జైకు మార్, మాస్టర్ విజయ కుమార్, పాస్టర్లు శామ్యూల్, దినకర్, క్రైస్తవులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న క్రైస్తవ పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు

పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలి

పీలేరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలని ఎల్ఐసీ ఏజెంట్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం ఎల్ఐసీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ జీఎస్టీ రద్దుతోపాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, ఏజెంట్ల సంక్షేమాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి పీఎంఎస్ రెడ్డి, సభ్యులు కేశవ, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏజెంట్లు

ఏఐపై పట్టు సాధిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు

కురబలకోట, అక్టోబరు 28: ఆర్టిపీషియల్ ఇంటలిజెన్స్ పై పట్టు సాధిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను పొంద వచ్చని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ప్రతి నిధి శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంగ ళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ డేను పురస్కరించుకుని రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్టిపీషియల్ ఇంటలిజెన్స్ అండ్ కంప్యూటర్ మిషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో ఆర్టిపీషియల్ ఇంట లిజెన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దీని మంచి ఫలితా లను సాధించడంతో పాటుగా సాంకేతిక పరంగా ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చునన్నారు. అంతేకాకుండా ఏఐ పరిశ్రమల రంగాల్లో ఎంతో దోహదపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన వివిధ రకాల ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి రాజశేఖరన్, కో ఆర్డినేటర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ప్రతినిధి శ్రీనివాసుల రెడ్డి

బాణసంచా దుకాణాలకు 23 దరఖాస్తులు

ములకలచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో దీపావళి పండగ సందర్భంగా టపాసుల విక్రయాలకు 23 దరఖాస్తులు వచ్చినట్లు ములకలచెరువు అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు తెలిపారు. బి.కొత్తకోట మండలంలో తొమ్మిది, ములకలచెరువులో ఆరు, పెద్దతిప్పసముద్రంలో మూడు, పెద్దమండ్యంలో మూడు, తంబళ్లపల్లెలో రెండు దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. దుకాణదారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గుర్రంకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుకోవాలని వాల్మీకీపురం సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఎస్వీ డ్రిగీ కాలేజిలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి, యువకులకు విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. ఈ దశలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమల్లయ్య, ఎస్ఐ మదురామచంద్రుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన వీఆర్వోలు

నిమ్మనపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 9మంది వీఆర్వోలు విధుల్లో చేరినట్లు తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజ రెడ్డివారిపల్లి -1, శ్రీనివాసులు తవళం, హేమేంబర్‌రెడ్డి రెడ్డివారిపల్లి-2, సురేంద్రరెడ్డి నిమ్మనపల్లి-1, శ్రీనివాసులు ముష్టూరు, శాంతకుమార్ రాచవేటివారిపల్లి, సుధాకర్ సాయకోటవారిపల్లి, రెడ్డిరాణి నిమ్మనపల్లి-2, ప్రవాన్‌కుమార్ వెంగంవారిపల్లికు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

సారా స్వాధీనం..ఇద్దరు అరెస్ట్

నిమ్మనపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సారా విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకొని వారి వద్దనుంచి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పెస్వామి తెలిపారు. గౌనిగారిపల్లి సమీపంలో సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి గిరి(25), చంద్రశేఖర్(32)ల వద్ద నుంచి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

రంగసముద్రం చేపల చెరువు వేలం రద్దు


పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగసముద్ర, రాపూరివాండ్లపల్లె గ్రామాలకు చెందిన రంగసముద్రం పెద్దచెరువు చేపల బహిరంగ వేలం రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ంగసముద్రం పెద్దచెరువు చేపల బహిరంగ వేలం కాకుండా గుట్టుగా రెన్యూవల్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ రాపూరివాండ్లపల్లె గ్రామస్థులు పంచాయతీ అదికారులతో వాదనకు దిగారు. గత ఏడాది ఫసలీకి సంబంధించి రూ.15.10 లక్షలకు హెచ్చు పాటదారుడు దక్కించుకున్నారు. అయితే ఫసలీకి ఈ ఏడాది ఆగస్టుకే గడువు ముగియడంతో ఎలాగైనా అదికారులతో కలిసి వేలం పాటలో మళ్లీ గతంలో వేసిన పాటదారునికే రెన్యూవల్ చేయాలనే ఉద్దేశ్యంతో గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో ఎవ్వరికి తెలియకుండా దండోరా వేయకుండా సచివాలయాల్లో కూర్చుని ఎలా వేలం పాట నిర్వహిస్తారంటూ గ్రామస్థులు పట్టు పట్టారు. దీంతో పంచాయతీ అదికారులు చేసిది లేక ఎట్టకేలకు వేలం పాటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి నోటీస్ బోర్డులో అతికించడంతో అక్కడి వాతావరణం చల్లబడింది. తదుపరి చేపల చెరువు వేలం పాటను నిర్వహించేందుకు జిల్లా అదికారులు తేదీని ప్రకటించేంత వరకు వేలం పాటను రద్దు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకటించారు తదుపరి వేలం పాట జరిపే తేదీ ప్రకటిస్తే ఆ విషయాన్ని రెండు గ్రామాల్లో దండోరా వేయించి తదనంతరం వేలం నిర్వహిస్తామని ప్రకటించారు.

మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

వాల్మీకిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహాజన నేత మంద కృష్ణ మాదిగ రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా నవంబర్ 4వ తేదీన తిరుపతి మహానగరంలో జరుగు మాదిగల మహా సదస్సుకు ఎంఆర్‌పీఎస్ అనుబంద సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎంఎస్‌పీ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథం గత రెండు రోజులుగా వాల్మీకిపురం మండలంలోని ఎల్లెక్కివారిపల్లి, జోగినేనిపల్లి, శాకంవారిపల్లె, లక్ష్మీపురం, టేకలకోన, నెమలిగుండ్ల దళితవాడ, తదితర గ్రామాల్లో పర్యటించారు. షెడ్యూల్ కులాల (ఎస్సీ) వర్గీకరణ లక్ష్య సాధన కోసం గత 30సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేసి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చట్టబద్దత రాష్ట్రాలు చేసుకునే హక్కు ఉందని స్పష్టం చేయడం, తరువాత ఎస్సీ వర్గీకరణ విజయసారథి మహాజన నేత మందకృష్ణ మాదిగ మొట్టమొదట సారిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి పర్యటనకు వస్తున్న సందర్భంగా జిల్లాలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు తరలి వచ్చి మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, యువత పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి


నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు28:(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాల్ పాఠశాలల్లో దాదాపు 30 మంది పార్ట్‌టైం, ఫుల్ టైం పేరుతో పనిచేస్తూ అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్, సంజీవా, కార్మికులు మాధవి, రెడ్డెమ్మ, సుబ్బలక్ష్మీ, నారాయణమ్మ, రమాదేవి, తులసి, రామలక్ష్ము, అలివేలఅట, ఫరీదా, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

వంకపొరంబోకు ఆక్రమణపై ఫిర్యాదు

వాల్మీకిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తేపురంలోని సర్వేనెంబరు 982లో 4.44సెంట్లు వంక పొరంబోకు భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి వ్యవ సాయం చేస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్ చామకూరికి సోమవారం ఫిర్యాదు చేశారు. తక్షణమే వంక పొరంబోకు స్వాధీనం చేసుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పినట్లు వారు తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు నరసింహులు, చంద్రశేఖర్, మల్లికార్జున, కృష్ణమూర్తి, గురుప్రసాద్, సరస్వతి, ఎర్రప్ప, లక్ష్మీదేవి ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించండి


సబ్‌కలెక్టరేట్ గ్రీవెన్స్‌డేలో ప్రజల అర్జీలను విచారిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మండల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్(గ్రీవెన్స్‌డే) కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 78 అర్జీలు వచ్చాయి. వాటన్నింటి పరిశీలించి అర్జీదారుల సమస్యలను సావధానంగా విన్న సబ్‌కలెక్టర్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అంతే కాకుండా అర్జీలను ఆయా మండల తహసీల్దార్‌లకు రెఫర్‌చేశారు. కాలువ నిర్మాణానికి తమ భూములు సేకరించి ఐదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వలేదని పీటీఎం మండలం కందుకూరు రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. తన ఇంటి ముందు చెత్త దిబ్బను పెట్టి కొంత మంది చెత్త అంతా తెచ్చి వేస్తున్నారని, మున్సిపల్ అధికారులకు తెలిపినా సమస్య పరిష్కారం కాలేదని పట్టణంలోని దేవళం వీధికి చెందిన రహంతుల్లా ఫిర్యాదు చేశాడు. తమ భూమిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారని, తనకు తప్ప మిగిలిన వారికి పరిహారం చెల్లించారని, కనీసం చింతచెట్లకు కూడా పరిహారం ఇవ్వకుండా వీఆర్వో ఆలస్యం చేస్తున్నాడని మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి చెందిన ఆదినారాయణ ఫిర్యాదు చేశాడు. బసినికొండ పంచాయతీలోని స్వామిచెరువు సప్లై చానల్‌ను శేఖర్ అనే వ్యక్తి పూడ్చివేసి కబ్జా చేశాడని ఎ.మనోహర్ నాయుడు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వాటన్నింటిపై సంబంధిత అధికారులు వెళ్లి విచారించి ఆక్రమణలు తొలగించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించండి


అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ మేనేజర్

మదనపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రతిసోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల దినోత్సవంలో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ మేనేజర్ పీఆర్ మనోహర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉద యం 10:30గంటల నుంచి 11:30గంటల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో సామాజిక, వ్యక్తిగత అంశాలకు సంబంధించి పది అంశాలపై ప్రజలు అర్జీలు అందజేశారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ మెరుగు పరచాలని, గాంధీరోడ్డులో ఆక్రమణలు తొలగించాలనివినతుల రూపంలో ప్రజలు మేనేజర్ దృష్టికి తెచ్చారు. ఫిర్యాదులను రికార్డులో నమోదు చేసిన అధికారులు..దానికి సంబంధించిన రసీదును అర్జీ దారునికి అందజేశారు. టీపీవో జకీరాబేగం, ఆర్ఐ శ్రీనివాసులు, మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా


జయచంద్రారెడ్డి చేతులమీదుగా జీవితకాలపు సభ్యత్వాన్ని తీసుకుంటున్న కట్టా సురేంద్ర నాయుడు

ములకలచెరువు/పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కలుగుతుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయ చంద్రాడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పెద్దతిప్పసముద్రం మండల టీడీపీ నాయకుడు కట్టా సురేంద్రనాయుడు రూ.లక్షతో శాశ్విత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా కట్టా సురేంద్ర నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి పాలనలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని కొనియాడారు. నాయకులు ఎవరైనా లక్ష రూపాయల సభ్యత్వం చేస్తే పార్టీలో శాశ్వత సభ్యత్వంతో పాటు ఏడాదిలో రెండు లేదా మూడు మార్లు టీడీపీ అదినాయకుడు చంద్రబాబు నాయుడిని కలిసే అవకాశం ఉంటుందన్నారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో నిలిచే విధంగా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగూర్ విశ్వనాథరెడ్డి

పెద్దమండ్యం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగూర్ విశ్వనాథరెడ్డి పిలుపునిచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని సభ్యత్వ నమోదును ప్రత్యేక శ్రద్ధతో చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాలేషా, గంగాధర, మహేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: టీడీపీలో సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అయ్యవారిపల్లెలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడమే సీఎం నారా చంద్రబాబునాయుడు ధ్యేయమన్నారు. అనంతరం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంటింటా చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ కంభం సావిత్రి, సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు చంద్రమౌళి, గోవిందు, నరసింహులు, సంతోష్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు సంక్షేమంతో పాటు భరోసా లభిస్తుందని తంబళ్లపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి అన్నారు. టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని పలు గ్రామాలలో విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కాగా, తంబళ్లపల్లెలో పెద్దఎత్తున టీడీ పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తమ ఫోన్ల ద్వారా నూతన సభ్యత్వం చేసుకుంటుండగా, మరికొందరు సభ్యత్వాన్ని పునరుద్ధరించుకుంటున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోముశేఖర్, సిద్దమ్మ, వీరాంజినేయులు, నాగేంద్ర, వార్డు సభ్యుడు జగదీష్, సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తంబళ్లపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి సూచించారు. సోమవారం మండలానికి నూతనంగా వచ్చిన సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..సచివాలయ ఉద్యోగులు గ్రామాలల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగు నీరు వంటి మౌలిక వసతులపై శ్రద్ధ వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో బాగంగా చేపడుతున్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు వంటి అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం నుంచి మంజూరై నిర్మాణంలో ఉన్న ఇళ్లను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో థామస్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూడలేకనే ప్రభుత్వంపై విమర్శలు

నిమ్మనపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం చూడలేకనే ప్రభుత్వంపై జగన్ విమర్శలు చేస్తున్నారని టీడీపీ రాజంపేట అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తల్లి, చెల్లిని కూడా వదలకుండా వారిపై కేసులు పెడుతూ వారిని హించించడం ఒక్క జగన్‌కే సాధ్యమని ఎద్దేవాచేశారు. వైసీపీ ప్రభుత్వంలో 9సార్లు విద్యుత్ బిల్లులు పెంచాడని, అలాగే రాష్ట్ర రాజధాని అమరావతిపై కత్తి కట్టి నట్టేట ముంచేసిన ఘనత జగన్‌కు దక్కుతుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడు తున్న పథకాలపై కనీసం అవగాహన లేకపోవడం దారుణమన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

మదనపల్లె, అక్టోబరు 28:(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు తగిన అజెండాతో రావాలని వారు కోరారు.